వార్త
ఆదివారం
20 ఆగస్టు 2017

గోవుల ఘోష!

అక్రమ రవాణా ఆగేదెలా?

తారాతీరం

తాప్సీ మూవీకి ప్రమోషన్



హిందీలో వరుస సక్సెస్‌లతో మంచి గుర్తింపు తెచ్చుకున్న తాప్సీ.. తెలుగులో చేస్తున్న సినిమా ఆనందో బ్రహ్మ. హారర్ కామెడీ జానర్‌లో రూపొందిన ఈ చిత్రం రొటీన్ హారర్ చిత్రాలకు భిన్నంగా ఉంటుందని దర్శక, నిర్మాతలు చెబుతున్నారు.. తాజాగా ఈ చిత్రం ప్రమోషన్లను గ్రాండ్‌గా నిర్వహించారు.. అందులో భాగంగా బాహుబలితో జాతీయస్థాయి నటుడిగా ఎదిగిన ప్రభాస్ ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకు ఆహ్వానించారు. దీంతో సినిమాకు మంచి పబ్లిసిటీ అభించిందని అంటున్నారు..

ఓపెనింగ్‌లతో మిల్కీ బిజీ



తెలుగులో కొత్తగా వచ్చిన ఒక హీరోయిన్‌కు ఒక హిట్ సినిమా ఇవ్వగానే ఆ హీరోయిన్‌కి ఏదో ఒక దుస్తుల దుకాణం, నగల షోరూంకు ప్రచారం చేసే అవకాశం ఆ హీరోయిన్ వద్దనుకున్నా వచ్చేస్తుంది. రమ్యకృష్ణ నుంచి సుహాసిని వరకు; సమంత నుంచి కొత్త హీరోయిన్ల వరకు ఏదో ఒకదానికి ప్రచారం చేస్తూనే ఉన్నారు. సౌత్‌లో పాపులర్ హీరోయిన్ తమన్నా మాత్రం బ్రాండ్ అంబాసిడర్‌గా అందరికంటే కొంచెం ఎక్కువగానే చేస్తోంది. కొత్తగా మరో షోరూమ్ ఓపెనింగ్ ఈవెంట్‌కు హాజరైంది.. బాహుబలి తర్వాత ఏ సినిమాకు సంతకం చేయని తమన్నా ఇపుడు షాప్ ఓపెనింగ్‌లకు హైదరాబాద్ వచ్చేసింది. ఇలా రావటం సంతోషంగా ఉందని చెప్పింది.

మరోసారి గాయనిగా.. అందాల రాశి

స్టార్ హీరోయిన్లలో ఒకరైన రాశిఖన్నాకు నటన మాత్రమే కాకుండా పాడటం మీద కూడ అమితాసక్తి ఉంది.. అందుకే ఎప్పుడెప్పుడు చాన్స్ దొరుకుతుందా.. టాలెంట్ చూపిద్దామా అని ఎదురుచూస్తుంటుంది ఆమె.. ఆ తపనకి తోడు ఆమె గాత్రం కూడ బాగుండటంతో అడపా దడపా పాడే అవకాశాలు వస్తూనే ఉన్నాయి.. మొదటగా తన చిత్రం జోరులో ఒక పాట పాడిన ఆమె, తర్వాత తన మాలయాళ డెబ్యూట్ సినిమా విలన్‌కోసం గొంతు సవరించుకుని, ఇపుడు నారా రోహిత్ నటిస్తున్న ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ సంగీతం అందిస్తున్న బాలకృష్ణుడు సినిమాకు పాడింది. విశేషం ఏమిటంటే ఈ చిత్రం హీరోయిన్ మాత్రం రెజీనా!

కె.లీలా సువర్ణ

ఆదివారం వార్త

20 ఆగస్టు 2017

మంచి ముత్యాలు

మీరు నిజాయితీపరులుగా ఉండండి.
ఈ ప్రపంచంలోని జనాభానుంచి
ఒక దుర్మార్గుడి సంఖ్య తప్పక తగ్గిందన్న
భావన మీకు కలుగుతుంది.

-థామస్ కార్లయిల్

విషయ విశేషం



భావ వీచిక



ఆత్మహత్య 'ఆట'?!

ఆటలు మనిషికి శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, పిల్లలు రోజూ కొంత సమయం ఆటలకు కేటాయించాలనీ చెపుతుంటారు. ఇంట్లోనే ఆడుకునే చదరంగం వంటి ఆటలు కూడా మేథను పెంచేవే. ఆరోగ్యాన్నిచ్చే ఈ ఆటలుండగా, ఆరోగ్యాన్ని చెడగొట్టే..కాదు కాదు, ప్రాణాలనే తీసే ఆన్‌లైన్ గేమ్‌లు రావడం ఇప్పుడు అందరినీ కలవరపరుస్తోంది. 'బ్లూవేల్' అనే గేమ్ కారణంగా యుఎస్, చైనా, ఇతర దేశాలలో కలిపి మొత్తం 100మందికి పైగా పిల్లలు మరణించారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఈ 'బ్లూవేల్' గేమ్ మనదేశంలో సైతం ప్రవేశించింది. ఆ గేమ్‌లో 50 వరకు టాస్క్‌లు ఉంటాయి. బ్లేడ్‌తో చేతి మీద 157అని చెక్కి, ఆ ఫొటోను క్యురేటర్‌కు పంపడం మొదటి టాస్క్. ఆపైన గేమ్ ఆడేవారు తమని తాము హింసించుకునే టాస్క్‌లెన్నో. చివరగా ఆత్మహత్య చేసుకునే టాస్క్. ఇటువంటి ఉన్మాదభరితమైన టాస్క్‌లు ప్రాణాంతకాలు కాక ఏమవుతాయి? పిల్లలు ఆ గేమ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, ఆ పిచ్చిలో చివరకు ప్రాణాలనే పోగొట్టుకోవడం విషాదం. ముంబైలోని మన్‌ప్రీత్‌సాహస్ అనే పద్నాలుగేళ్ల బాలుడు ఈ గేమ్ ఆడుతూ చివరకు బిల్డింగ్ పైనుంచి దూకి మరణించాడు. ఆ తర్వాత ప.బెంగాల్‌లోని మిద్నాపూర్‌జిల్లాకు చెందిన కేశ్‌పూర్‌లో 'అంకాన్ డే' అనే పదో తరగతి విద్యార్థి ఈ బ్లూవేల్ గేమ్ ఆడి, చివరకు ఉరేసుకున్నాడు. మరో ఇద్దరు పిల్లలు సైతం ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే అదృష్టవశాత్తు ఆఖరి నిముషంలో రక్షింపబడ్డారు. పరిస్థితి తీవ్రంగా మారుతుండటంతో ప్రభుత్వం సోషల్ మీడియాను, ఇంటర్నెట్‌లో ప్రధానంగా ఉన్న గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ మొదలైనవాటిని బ్లూవేల్ సూసైడ్ గేమ్ లింక్‌లను తొలగించమని ఆదేశాలు జారీ చేయడం ఎంతో సముచితంగా ఉంది. అయినప్పటికీ ముందుగా పిల్లల్లో అటువంటి గేమ్‌ల పట్ల వ్యామోహం కలగకుండా చూసే బాధ్యత తల్లిదండ్రులు, పెద్దల మీద ఉంది. వాటి వల్ల కలిగే నష్టాన్ని వారికి వివరించి, వారు ఆడే ఆటలను ఓ కంట గమనిస్తూ జాగ్రత్త పడాల్సిన అవసరం కూడా ఎంతో ఉంది!

లేఖలు

..కళ్లకు కట్టింది

ఆగస్టు 6 వార్త ఆదివారం అనుబంధంలో కవర్ కథనం 'నేత'ల వెతలు..కన్నీటి కతలు' మన దేశంలో, తెలుగురాష్ట్రాల్లోని నేతన్నల దుస్థితిని కళ్లకు కట్టింది. చెమటోడ్చి, ఎంతో కళాత్మకంగా తయారుచేసే చేనేతలను ఆదరించి, ప్రోత్సహించటం మనముందున్న కర్తవ్యం. మీకు మా అభినందనలు.

-జి.మనోహార్, నల్గొండ.

మేలైన అంశాలు

ఆగస్టు 6 వార్త ఆదివారం అనుబంధంలో కవర్ స్టోరీ 'నేత'ల వెతలు..కన్నీటి కతలు' చదివి చలించిపోయాం. తరాలు మారినా తలరాతలు మారలేదని వారి కన్నీటి కతలు చెపుతున్నాయి. వారికి ప్రభుత్వ అండదండలతోపాటు, ప్రజల ప్రోత్సాహం ఉండాలి. అందరూ చేనేతలను ఆదరించాలి. సాహితీ వనంలో నిజమైన కవిత్వం ఎలా ఉండాలో చెప్పిన తీరు బాగుంది. ... రక్షా బంధనం, స్నేహం సంజీవని ఆర్టికల్స్ బాగున్నాయి. 'మనిషికో స్నేహం' కథ స్నేహితానికి అద్దం పట్టింది. కవితలు అలరించాయి. సింగిల్‌పేజీ కథ 'రెండుచుక్కల కన్నీరు' మనసు చెమర్చేలా ఉంది. నవ్వుల్.. రువ్వుల్..చదివి హాయిగా నవ్వుకున్నాం. చిత్రభారతిలో షారూక్ గురించి చక్కగా చెప్పారు.

-ఆదూరి పద్మావతి, హైదరాబాద్.

అనుబంధం ఆకట్టుకుంది..

వార్త ఆదివారం మేగజైన్ ఆగస్టు 6 సంచికలో భావవీచిక-ఒక కాంతిరేఖ ఎంతో బాగుంది, ఎంతోమందికి స్ఫూర్తినిచ్చేలా ఉంది. ఆరోగ్య పరిరక్షణకు సంపూర్ణ ఆహారంపట్ల అవగాహన ప్రాముఖ్యతను 'సంఘీ' భావం' చక్కగా చెప్పింది. 'మూడోకన్ను'లో నితీశ్ కథలో నీతి..విశ్లేషణ బాగుంది. 'రెండుచుక్కల కన్నీరు' కథ కళ్ల చెమ్మగిల్లచేసింది.

-డా.శివభూషణం, కర్నూలు.

కథ నచ్చింది..

ఆగస్టు 6 వార్త ఆదివారం మేగజైన్‌లో ఆద్యంతం 'మనిషికో స్నేహం' కథ బాగుంది. విద్య నిగూఢ గుప్తమగు విత్తము సుమ్ము' అని సోదాహరణగా, హృద్యంగా మలచిన చిన్న కథను మదిలో పదిలంగా దాచుకుంటా. రచయిత్రికి అభినందన మందారాలు.

-యం.బాలగంగాధరయ్య, హైదరాబాద్.

వాసిగల వ్యాసాలు

ఆగస్టు 6 వార్త ఆదివారం మేగజైన్‌లో వ్యాసాలన్నీ బాగున్నాయి.సాహితీవనంలో కవిత స్వరూప స్వభావాల విశ్లేష బాగుంది. 'మనిషికో స్నేహం' కథ చక్కగా ఉంది. రక్షాబంధనం, స్నేహం గురించిన ఆర్టికల్స్ సందర్భోచితంగా ఎంతో విలువైనవిగా ఉన్నాయి. ఇక చేనేతన్నల బాధలను దూరంచేసేందుకు ప్రభుత్వాలే స్పందించాలి.

-నేమాన సుభాష్‌చంద్రబోస్, విశాఖపట్నం.

'సంఘీ'భావం



నవభారత్‌పై ఆశలు!

ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన 'నవభారత్' నిర్మాణ నినాదంపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 2022 నాటికి సరికొత్త భారతదేశం అవతరిస్తుందని అందుకు తగిన కార్యాచరణను అమలు చేస్తామని నరేంద్రమోడీ ఇచ్చిన ఎర్రకోట ప్రసంగం భారతీయులను ఆకట్టుకున్నది.

ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో అనేక నినాదాలు క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకొని ఫలితాలు ఇస్తుండటంతో మోడీ న్యూ ఇండియా నినాదంపై కూడా భారతీయుల్లో విశ్వాసం కనిపిస్తున్నది. ఇప్పటిదాకా ఎన్‌డిఏ ప్రభుత్వం స్వచ్ఛభారత్, స్టాండప్ ఇండియా, స్కిల్ ఇండియా, మేక్ ఇండియా అనే నినాదాలు ఇవ్వడమే గాకుండా వాటి అమలుకు గట్టి కృషి జరిపింది. పూర్తి స్థాయిలో ఈ నినాదాల ఫలితాలు రాకున్నా కొంతమేరకు ఇంకా చెప్పాలంటే ఆశాజనక వాతావరణం ఏర్పడుతున్నది.

స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తరువాత భారతదేశంలో సమస్యలన్నీ సమసిపోలేదు. నిరుద్యోగం, అవిద్య, అజ్ఞానం, మూఢ నమ్మకాలు అనారోగ్యం, అసమతుల్య అభివృద్ధి, పేదరికం, అవినీతి లాంటి సమస్యలు ఇంకా భారత్‌ను పట్టిపీడిస్తున్నాయి. దేశ అభివృద్ధికి ప్రతిబంధకంగా ఉన్న ఈ సవాళ్లను అధిగమించడంలో కొంత కృషి జరుగుతున్నది. ఫలితాలు అందుతున్నాయి. నరేంద్రమోడీ సరికొత్త భారత్‌ను ఆవిష్కరించడానికి తీసుకువచ్చిన జిఎస్‌టి, నోట్ల రద్దు లాంటి సాహసోపేత సంస్కరణలపై కూడా విమర్శలు లేకపోలేదు. అయినా అవినీతిని నిరోధించడానికి పేదరికాన్ని దశలవారిగా తొలగించడానికి చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరుగుతున్నాయని సంస్కరణలు నిరూపించాయి. అయిదేళ్లలో భారత్‌ను అన్ని సమస్యల నుంచి ఎవరూ విముక్తి చేయలేరు. 70 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత భారత్ ప్రపంచ దేశాల్లో మేటిగా నిలవాలంటే మరెంతో కృషి జరగాలి. దేశానికి యువతే ప్రధాన ఆస్తి. అయితే దేశంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తున్నది. ఎన్‌డిఏ ప్రభుత్వం ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాల హామీ అమలులో కొంత లోపం ఉంది. ఆరోగ్య భారత్‌ను కూడా పూర్తిగా చూడలేకపోతున్నాం. స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు జరుపుకోవడానికి కొద్ది రోజుల ముందే దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఆక్సిజన్ అందక ముక్కుపచ్చలారని అనేకమంది చిన్నారులు మృత్యువాతకు గురయ్యారు. ఇది నిజంగా 70 ఏళ్ల స్వాతంత్ర్యానికి సిగ్గుచేటు. ప్రభుత్వ రంగంలో ఆరోగ్య వ్యవస్థ అదీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎంత అధ్వాన్నంగా ఉందో ఈ సంఘటన తేటతెల్లం చేస్తున్నది.


కేంద్ర ప్రభుత్వమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సమతుల్య అభివృద్ధికి అంతరాలు లేని సమాజ నిర్మాణానికి విద్య, ఆరోగ్య రంగాలను ముందుగా సంస్కరించాలి. ప్రతి పేదవాడు డబ్బుతో సంబంధం లేకుండా విద్య, ఆరోగ్యాన్ని పొందగలగాలి. అప్పుడే 'నవభారత్' ఆవిష్కృతమవుతుంది. నరేంద్రమోడీ అభిలషించిన నవభారత్ సాకారం కావాలంటే కేంద్రంతోపాటు రాష్ట్రప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు రాజకీయాలకు అతీతంగా పని చేయాలి. పేదల కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ, నీరు, విద్య, ఆరోగ్యం అందించాలి. ఇవి లేక ప్రజలు అల్లాడే దయనీయ పరిస్థితిని తలెత్తనివ్వకుండా పాలకులు పాలన సాగించాలి. 125 కోట్ల జనాభాతో భవిష్యత్‌లో చైనా జనాభాను మించిపోయే భారత్ నవభారత్‌గా మారాలంటే సంస్కరణలతోపాటు సంక్షేమం కూడా బండి రెండు చక్రాల మాదిరిగా సమానంగా ముందుకు వెళ్లాలి. అప్పుడే పేద, ధనిక తారతమ్యం లేకుండా ప్రజలంతా కనీస అవసరాలను సాధించుకొని నవభారత్‌లో ముందుకు వెళ్లగలుగుతాం. పాలకులు ఇచ్చే నినాదాలు నినాదాలుగా మిగిలిపోకూడదు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన అన్నిటికి ఏ ప్రభుత్వమైనా కట్టుబడి ఉండాలి. చేయదగిన హామీలనే పార్టీలు ఇవ్వాలి. అధికారంలోకి వస్తే వాటిని అమలు చేయడానికి చిత్తశుద్ధితో పని చేయాలి.

దేశం అంతర్గతంగా ఎదుర్కొంటున్న సవాళ్లే కాకుండా కొత్తగా మరికొన్ని సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. అవి పొరుగున్న ఉన్న చైనా, పాకిస్థాన్ నుంచి ఇటీవల కాలంలో బెదిరింపులు ఎక్కువవుతున్నాయి. దురాక్రమణలు, కవ్వింపులు, హెచ్చరికలు- ఇవన్నీ యుద్ధ మేఘాలు కమ్ముకునేలా చేస్తున్నాయి. యుద్ధమే వస్తే పరిస్థితి ఏమిటని? దాన్ని మనం ఎదుర్కోగలమా? అని ప్రజలు సందేహిస్తున్నారు. దీనికినరేంద్ర మోడీ తన ఎర్రకోట ప్రసంగంలో సరైన సమాధానం ఇచ్చారు. ఉగ్రవాదం, దురాక్రమణలపై ఉదాసీ వైఖరి ఉండదని ఈ విషయంలో ఎంత కఠినంగానైనా వ్యవహరిస్తామని, త్యాగాలకు కూడా వెనుకాడమని ఆయన చేసిన ప్రసంగం ప్రజల్లో కొండంత ధైర్యాన్ని నింపింది. నరేంద్రమోడీ ఆధార్ నుంచి అంతరిక్షందాకా అన్ని అంశాలను స్పృశిస్తూ నవభారత్ అసాధ్యమేమీ కాదని భారత్ ప్రజలకు భరోసా ఇచ్చారు. అందరం కలిసి పని చేస్తే భారత్‌లో ప్రపంచాన్ని ఎదుర్కొనే శక్తి ఉందని భారతీయులకు ఉన్న సమైక్య సత్తాను తెలియజెప్పారు. సమైక్య భారతావని దిశగా అంతా రాగద్వేషాలకు అతీతంగా అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

భారత్‌లో పరిపాలన సజావుగా, పారదర్శకంగా సాగుతుందని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. బాలగంగాధర్ తిలక్ అప్పట్లో ఇచ్చిన 'స్వరాజ్' ఇప్పుడు 'సురాజ్' (సుపరిపాలన) కావాలని ఆయన అభిలషించారు. ఇప్పుడు మనముందున్న కర్తవ్యాలను భారతీయులు గుర్తెరిగి ప్రవర్తించాలని పాజిటివ్ ధోరణితో ముందుకు వెళ్లాలని ఆయన కోరడం భారతీయులను ఆలోచింపచేసింది. అణుశక్తికన్నా భారతీయులు శక్తిమంతులని, ప్రపంచంలో ఏ దేశమేగినా ఆ దేశఅభివృద్ధిలో సంపద సృష్టిలో భారతీయులదే ముందడుగు అని ఆయన గుర్తు చేశారు. ప్రపంచ దేశాలను జయిస్తున్న భారతీయులు భారత్‌ను నవభారత్‌గా నిర్మించడానికి ఎన్ఆర్ఐలు కూడా ముందుకు వస్తున్నారని వారి చేయూతతో ఏదైనా చేయగలమనే విశ్వాసం తమలో ఉందని నరేంద్రమోడీ ప్రజలను ఉద్దేశిస్తూ ధైర్యాన్ని నూరిపోశారు.

మంచి రోజులు ముందున్నాయని చెప్పిన ఎన్‌డిఏ ప్రభుత్వం గడిచిన నాలుగేళ్ల వెనక్కితిరిగి హామీలు, ప్రగతిని సమగ్రంగా సమీక్షించుకొని ముందుకు వెళితే నవభారత్ దిశగా అడుగులు పడడం ఖాయమని చెప్పడంలో సందేహం లేదు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



శిశు విలాపం..

– ఎ.వి.వి. ప్రసాద్

శిశువులకు తగిన చికిత్స అందించడంలో మన దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రులు చాలా వెనుకబడి ఉన్నాయని చెప్పడానికి గోరఖ్‌పూర్‌లోని ఆ బిఆర్‌డి ఆసుపత్రే ఉదాహరణ. ప్రభుత్వ దవాఖానాల దయనీయ స్థితికి అద్దం పట్టే ఆసుపత్రి అది. ఒక సర్వే ప్రకారం దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో 63 శాతం వరకు కనీస సౌకర్యాలు కూడా లేనివే. ఆధునిక పరికరాలు లభించని ఆసుపత్రులు 80 శాతం ఉండగా, అత్యవసర చికిత్సలకు అవసరమైన ఔషధాలు లభించని ఆసుపత్రులు 73 శాతం ఉన్నాయి. జిల్లా స్థాయి ఆసుపత్రులలో సైతం 'స్పెషలిస్టు'ల కొరత అధికంగా ఉన్నదనీ, 78 శాతం జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో స్పెషలిస్టులనబడే డాక్టర్లే లేరనీ తెలుస్తోంది. కొన్ని ప్రత్యేక వ్యాధులకు ఎలాంటి చికిత్స లభించని ప్రభుత్వ ఆసుపత్రులు 92 శాతం ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. కేవలం నర్సు, కాంపౌండర్లతో నడుస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 32 శాతం ఉన్నాయంటే అది మరింత ఘోరమనే అనిపిస్తుంది. ఇదీ మన ఆరోగ్య భారతం...

ఆసుపత్రులాయె అవినీతి నిలయాలు
పేద రోగులేమొ వీధిపాలు;
శిశువుకైన లేదు చివురంత భద్రత
విశ్వవినుత నామ! వినురవేమ!!

10..20..40..50..70.. ఇవి ఏవో మామూలు నంబర్లు కావు. దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిన శిశు మరణాలు. పోనీ దేశమంతటా కాదు.. ఒకే రాష్ట్రంలో. అంతేకాదు ఒకే ఊరిలో... ఇంకా చెప్పాలంటే ఒకే ఆసుపత్రిలో. ఎంత ఘోర విషాదం! గోరఖ్‌పూర్ నుంచి వినిపించిన ఆ శిశువుల తల్లిదండ్రుల రోదనలు అందరి గుండెలను పిండివేశాయి. కొన్ని గంటల వ్యవధిలో, కొద్ది రోజుల వ్యవధిలో అంతమంది శిశువులు మానవ నిర్లక్ష్యానికి పరాకాష్టగా అలా మరణించారంటే, అంతమంది తల్లుల గర్భశోకానికి కారణ మయ్యారంటే.. ఆ తప్పిదమెవరిది! ఎందుకలాంటి ఘోర విషాదం సంభవించాలి? అత్యాధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగిస్తూ లక్షల, కోట్లాది రూపాయలు వైద్య సౌకర్యాలపై వెచ్చిస్తూ, ప్రజల ఆరోగ్య భద్రతకే కట్టుబడి ఉన్నామంటూ అధికార నేతలు ప్రతి క్షణం హోరెత్తుతున్నా ఇంతటి ఘోర విషాదం సంభవించిందంటే అందుకు బాధ్యులు ఎవరని చెప్పాలి!

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో గల బిఆర్‌డి ఆసుపత్రిలో ఆగస్టు రెండో వారం– స్వాతంత్ర్య దినోత్సవానికి రెండు మూడు రోజుల ముందు వినిపించిన ఈ 'చావుకేకే'లు అందిస్తున్న 'సందేశ' మేమిటి! ఉత్సవాలు జరుగుతున్నాయంటే భవనాలకు కొత్త రంగులు వేస్తారు. కానీ ఆ భవనం లోపల పరిస్థితులు ఎంత దారుణంగా ఉంటున్నాయో ఎవరు పరిశీలిస్తున్నారు? ఆ పరిశీలనే జరిగిఉంటే ఆ ఆసుపత్రిలో అన్ని శిశు మరణాలు సంభవించి ఉండేవి కాదు కదా! సకాలంలో ఆ శిశువులకు సరైన వైద్య చికిత్సలు అంది ఉంటే పేరైనా పెట్టకముందే వారు మరణించి ఉండేవారు కారు కదా! ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌కు నిజానికి మంచి పేరే ఉంది. ఆయన అధికారంలోకివచ్చాక ప్రభుత్వ యంత్రాంగాన్నంతటిని గాడిలో పెట్టారనే మంచి పేరే వచ్చింది. అయితే గోరఖ్‌పూర్ విషాదం ఆ మంచిపేరునంతటిని కడిగివేసింది. ఆయన పాత్ర ఉండకపోవచ్చు, ఉండదు కూడా. కానీ ఆయన ప్రభుత్వ హయాంలోనే ఆ ఘటన సంభవించిందన్నది– చరిత్రలో రికార్డయిపోతుంది. దానిని ఎవరూ తుడిచివేయలేరు. విషయం తెలిసిన తర్వాత ఆ ఆసుపత్రిని సందర్శించి కొందరు అధికారులను ఆయన సస్పెండ్ చేసి ఉండవచ్చు. ఇంకా కొన్ని కఠిన చర్యలనూ తీసుకొని ఉండవచ్చు. కానీ శోక సముద్రంలో మునిగిపోయిన ఆ శిశువుల తల్లిదండ్రులను ఊరడించలేరు కదా! ఘటనలపై విచారణకు ఆదేశించారు.. కానీ ఆ విచారణలో ఏం తేలినా.. ఆ చిన్నారులను తిరిగి బతికించలేరు కదా! ఆక్సిజన్ కొరత కారణమంటున్నారు.. కానీ దానికి బాధ్యులు ఆసుపత్రి నిర్వాహకులే. అంటే అంతటి నిర్లక్ష్యం వారిలో పేరుకుపోయిందన్నమాట. ఏ ప్రైవేటు ఆసుపత్రో అయితే ప్రభుత్వం మరింత గగ్గోలు పెట్టి ఉండేది. కానీ బాబా రాఘవదాస్ పేరుతో గల ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి అది. మరింత బాధ్యతగా వ్యవహరించవలసిన చికిత్సాలయం అనుకొనే అక్కడికి రోగులంతా వస్తుంటారు. అంతేకాదు, కొన్ని ప్రత్యేక వ్యాధులకు చికిత్సకోసం శిశువులను ఎక్కువగా అక్కడికి తీసుకువస్తుంటారు. ముఖ్యంగా మెదడువాపు వ్యాధితో బాధపడే శిశువులకు ఆ ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్స లభిస్తుందనే పేరుంది. అటువంటప్పుడు నిర్వాహకులు ఇంకెంత బాధ్యతగా వ్యవహరించాలి! సమయానికి ఆక్సిజన్ లభించకపోవడంతో అన్ని డజన్ల మంది శిశువులు పిట్టల్లా రాలిపోయారంటే అంతకంటె ఘోరం ఏ ఆసుపత్రిలోనైనా ఇంకేముంటుంది! అది ప్రభుత్వ ఆసుపత్రి గనుక, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణంగా కనిపించే నిర్లక్ష్య వాతావరణమే అక్కడా తాండవించింది గనుక ఆ మొత్తం విషాద కాండకు ప్రభుత్వమే తప్పనిసరిగా బాధ్యత వహించవలసి ఉంటుంది.



యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నిన్న మొన్నటి వరకు ప్రాతినిధ్యం వహించిన గోరఖ్‌పూర్ పార్లమెంటరీ నియోజక వర్గంలోనే ఈ ఆసుపత్రి ఉందన్నది గమనించవలసిన మరో అంశం. ఆక్సిజన్ సరఫరాచేసే సంస్థకు కొన్ని నెలలుగా 64 లక్షల రూపాయల బకాయిలు చెల్లించకపోవడంతో, విజ్ఞప్తులు చేసి చేసి విసిగిపోయిన సరఫరాదారు ఆసుపత్రికి సిలిండర్ల సరఫరాను నిలిపివేశాడన్నది అధికారుల కథనం. దానితో సకాలంలో ప్రాణవాయువు లభించక చికిత్సవిభాగంలో ఉన్న చిన్నారులు ఒకరి తర్వాత ఒకరు అయిదారు రోజులపాటు వరుసగా పిట్టల్లా రాలిపోయారు. నాలుగురోజుల వ్యవధిలోనే 63మంది తనువు చాలించారు. వారిలో కొందరు ఇంకా కనులు పూర్తిగా విచ్చుకోని పసికూనలు. వారికి ఏం పేర్లు పెట్టాలో తల్లిదండ్రులు ఆలోచిస్తుండగానే, ఆ అవసరం లేకుండా వారు ఈ లోకాన్ని వదిలివెళ్లిపోయారంటే అంతకంటె ఘోర(ఖ్) కలి ఇంకేముంటుంది?

తమపై నిందపడకుండా తప్పించుకోడానికి ఆసుపత్రి యాజమాన్యం ఇతర కారణాలు చెప్పడం, వాటిని ప్రభుత్వంగాని, ముఖ్యమంత్రిగాని ఖండించకపోవడం మరింత పెద్ద తప్పిదమనే చెప్పాలి. ఆక్సిజన్ లభించకపోవడమే ఆ శిశు మరణాలకు కారణమని

మీడియా అంతా కోడై కూస్తున్నా, అందుకు ఆధారాలు అనేకం చూపుతున్నా పసిబిడ్డల ప్రాణాలు పోయేవరకు ఎవరూ దానిని పట్టించుకోనకపోవడం మరింత విచారకరమైన అంశం. ప్రభుత్వ వైద్య కళాశాల అధీనంలోని ఆ ఆసుపత్రిలోనే నిర్లక్ష్య వాతావరణం ఇంతగా ముసురుతుంటే, ఎక్కడో దూరంగా మారుమూల ప్రాంతాల్లో ఉండే ప్రభుత్వాసుపత్రుల్లో పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో ఊహకే అందని విషయమనిపిస్తుంది. ఈ ఆసుపత్రిలోని మెదడు వాపు వ్యాధి పునరావాస విభాగంలో పని చేసే వైద్యులు, నర్సులు, వార్డ్‌బాయ్‌లు ఎవరికీ గత రెండేళ్లుగా జీతాలు కూడా సరిగా లభించడం లేదట. అంటే చికిత్సకు అవసరమైన పరికరాలూ లేవు, నిజాయితీగా చికిత్స చేసేవారూ లేరు. అంతటి దారుణమైన పరిస్థితిలో అలాంటి ఆసుపత్రులు నడపడమెందుకు? పసిపిల్లల ప్రాణాలు తీయడమెందుకు!

****

శిశువులకు తగిన చికిత్స అందించడంలో మన దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రులు చాలా వెనుకబడి ఉన్నాయని చెప్పడానికి గోరఖ్‌పూర్‌లోని ఆ బిఆర్‌డి ఆసుపత్రే ఉదాహరణ. ప్రభుత్వ దవాఖానాల దయనీయ స్థితికి అద్దం పట్టే ఆసుపత్రి అది. ఒక సర్వే ప్రకారం దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో 63 శాతం వరకు కనీస సౌకర్యాలు కూడా లేనివే. ఆధునిక పరికరాలు లభించని ఆసుపత్రులు 80 శాతం ఉండగా, అత్యవసర చికిత్సలకు అవసరమైన ఔషధాలు లభించని ఆసుపత్రులు 73 శాతం ఉన్నాయి. జిల్లా స్థాయి ఆసుపత్రులలో సైతం 'స్పెషలిస్టు'ల కొరత అధికంగా ఉన్నదనీ, 78 శాతం జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో స్పెషలిస్టులనబడే డాక్టర్లే లేరనీ తెలుస్తోంది. కొన్ని ప్రత్యేక వ్యాధులకు ఎలాంటి చికిత్స లభించని ప్రభుత్వ ఆసుపత్రులు 92 శాతం ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. కేవలం నర్సు, కాంపౌండర్లతో నడుస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 32 శాతం ఉన్నాయంటే అది మరింత ఘోరమనే అనిపిస్తుంది. ఇదీ మన ఆరోగ్య భారతం.



అత్యవసర చికిత్సల కోసం అందుకే ప్రభుత్వాసుపత్రులకు వెళ్లాలంటే అందరూ భయపడుతుంటారు. పేదలు, మధ్యతరగతివారు ఎక్కువగా ఆధారపడే ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ విషయంలో ప్రభుత్వాలు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయో చెప్పడానికి బిఆర్‌డి ఆసుపత్రి చాలు. నిజానికి గోరఖ్‌పూర్ ఆసుపత్రినే నిందించ నక్కరలేదు. ఆక్సిజన్‌సిలిండర్లు అసలు కనిపించని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మండల ఆసుపత్రులు అనేకానేకం. వాటిని లెక్కించడం కూడా కష్టమే. బిఆర్‌డి ఆసుపత్రిలో ఈ యేడాది జనవరి నుంచి ఆగస్టు 8వ తేదీ దాకా మెదడువాపు వ్యాధిలో 470 మంది రోగులు చేరగా, వారిలో 117 మంది మరణించినట్లు లెక్కలు చెబుతున్నాయి. వారిలో చిన్నారులు దాదాపు 70 మంది దాకా ఉన్నారు. అంటే ఇక రోగులు ఆస్పత్రులకు రావడమెందుకు? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఆ ఆసుపత్రిలో శిశువులు అధికంగా మరణిస్తున్నారని ఆ నోటా ఈనోటా విన్న మీడియా సిబ్బంది అక్కడకు పరుగులు పెట్టగా అసలు వాస్తవాలన్నీ వెలుగులోకి వచ్చాయి. మీడియా దృష్టి పడకముందే.. శిశు మరణాలు ఇంకా ఎన్ని జరిగినా అలా కాలగర్భంలోనే కలిసిపోతూ ఉండవలసి వచ్చేదేమో! తలచుకొంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది.

గోరఖ్‌పూర్ పరిసర ప్రాంతాలు మెదడువాపు వ్యాధికి పెట్టింది పేరని డాక్టర్లకూ తెలుసు, ప్రభుత్వానికీ తెలుసు. ఆ పార్లమెంటు నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించిన ప్రస్తుత ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌కు మాత్రం తెలియకుండా ఎలా ఉంటుంది! తెలిసినా తగు జాగ్రత్తలు తీసుకొనడంలో విఫలమవుతున్నారంటే బాధ్యత వహించవలసింది ప్రభుత్వ నేతలే కదా! బిఆర్‌డి వైద్య కళాశాల యాజమాన్యం తమకు కొన్ని నెలలుగా బకాయిలు చెల్లించడం లేదనీ, అందుకే ఆక్సిజన్ సరఫరాను నిలిపి వేశామనీ 'పుష్పా సేల్స్' అనే సంస్థ పేర్కొనడాన్ని బట్టి- ఆ శిశు మరణాలకు ప్రధాన కారణం ఆక్సిజన్ కొరతే అని స్పష్టమవుతోంది. దానినిబట్టి తెలుస్తున్న విషయం- వైద్య కళాశాల అధీనంలోని ప్రత్యేక ఆసుపత్రికి సైతం వనరుల కొరత అధికంగా ఉన్నదని. మరి ఏటా ఆరోగ్య రంగానికి కేటాయిస్తున్న వేల కోట్లాది రూపాయలు ఎవరి జేబుల్లోకి దారి తప్పుతున్నాయి? ఈ సందేహానికి ప్రభుత్వం నుంచే సమాధానం రావలసి ఉంది. ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలుండవు, ఆధునిక చికిత్సా పరికరాలుండవు, ప్రత్యేక ఔషధాలుండవు, చివరికి డాక్టర్లకు, సిబ్బందికి జీతాలు కూడా ఉండవు. అయినా ఆ ఆస్పత్రుల నిర్వహణ వ్యయం కింద కోట్లరూపాయలు చిట్టాల్లో కనబడుతూంటాయి. అంటే అవినీతి వికటాట్ట హాసం చేస్తున్నదనేకదా అర్థం. అయినా ఏదో తూతూ మంత్రం మినహా, విషాదం సంభవించినపుడు మృతుల కుటుంబాలకు అంతో, ఇంతో పరిహారం ప్రకటించడం మినహా ప్రభుత్వాలు గట్టి చర్యలు ఏం తీసుకొంటున్నాయి? కేటాయించిన నిధులన్నీ కాంట్రాక్టర్ల పాలవుతున్న విషయం, వారిని నియమించిన 'ప్రజా ప్రతినిధుల' పాలవుతున్న విషయం బహిరంగ రహస్యమే అయినా- ఆ అవినీతి అలా కొనసాగుతూనే ఉంటోంది. ఇటువంటి పరిస్థితిలో ఆరోగ్య భారత్, మోడల్ హబ్ వంటి పదాలు నవ్వు పుట్టించడానికే పనికి వస్తాయి.

గోరఖ్‌పూర్ విషాదం మొదటిదీ కాదు, చివరిదీ కాదు. మన వ్యవస్థ తీరుతెన్నులెలా ఉన్నవో చెప్పడానికి అప్పుడప్పుడు అలాంటి ఉదంతాలు వెలుగులోకి వస్తుంటాయి. మీడియా దృష్టి పడకపోతే.. అలాంటివి ఎన్నయినా కాల ప్రవాహంలోనే జారిపోతూనే ఉంటాయి. అందుకే ఈ దుస్థితి మారే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేయవలసి ఉంది. కోల్‌కతాలోని బిసిరాయ్ ఆసుపత్రిలో కొన్ని సంవత్సరాల క్రితం గోరఖ్‌పూర్ వంటి సంఘటనలే జరిగాయి. అప్పుడూ ఇదే విధంగా కొద్దిరోజులు 'సంచలనం' కనిపించింది. రెండేళ్ల క్రితం ఒడిషాలోని ఒక ప్రభుత్వ శిశువుల ఆస్పత్రిలో 61 మంది పిల్లలు మరణించినపుడు కూడా కేంద్ర మంత్రులు, రాష్ట్ర ఆరోగ్య అధికారులు ఎంతో హడావుడి చేశారు. ఎన్నో సంచలన ప్రకటనలు చేశారు. గత సంవత్సరం అజ్మీర్లోని ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా ఇదేవిధంగా 16 మంది శిశువులు సిబ్బంది నిర్లక్ష్యానికి బలైపోయారు. అదే గోరఖ్ పూర్‌లో పునరావృతమైంది. ఆ నిర్లక్ష్య వైఖరే అన్ని ప్రభుత్వాసుపత్రులనూ వెంటాడుతోంది. అయినా ఫలితం ఏముంది? మళ్లీ ఏవో కొన్ని ప్రకటనలు, ఏవో కొన్ని తాత్కాలిక పరిహారాలతో సర్దుమణుగుతుంది. రేపు మరోచోట- మరో ఆసుపత్రులో మరో గోరఖ్ పూర్ ఉదంతం కనిపించదనే భరోసా ఎవరి నుంచైనా లభిస్తున్నదా? లేనే లేదు. శిశువులే కాదు, ఎన్నో వేల గ్రామాల్లో కనీస వైద్య సౌకర్యాలు కూడా లభించక కొన్ని లక్షలమంది పేదలు యేటా మృత్యువాత పడుతున్నారు. ఈ లెక్కలు ప్రతి సంవత్సరం మీడియాలో వినబడుతూనే ఉన్నా ప్రభుత్వ నేతల దారి వారిదే.

బడ్జెట్‌లో నిధులు ఎంత పెంచామో చెప్పే మంత్రులు, అధికారులు- ఆ నిధుల్లో ఎంత శాతం సక్రమంగా వినియోగమవుతున్నాయో చెప్పలేకపోతున్నారు. ఎంత శాతం దారి మళ్లుతున్నాయో, ఎందరు ప్రజా ప్రతి'నిధుల' జేబులు నిండుతున్నాయో చెప్పలేకపోతున్నారు. అందుకే మొన్న కోల్‌కతా, నిన్న అజ్మీర్, నేడు గోరఖ్‌పూర్ విషాదాలు వార్తల్లోకి వస్తున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు వస్తేనే దేశం నిజమైన 'ఆరోగ్య భారత్' అనిపించుకొంటుంది. వైద్య , ఆరోగ్య రంగంలో పేరుకుపోయిన అవినీతిని కూకటివేళ్లతో పెళ్లగించగలిగినప్పుడే వేలాది శిశువులు తిరిగి ఊపిరి పీల్చుకోగలుగుతారు, లక్షలు, కోట్లాది పేదలు ఆరోగ్యంతో బతకగలుగుతారు. సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలోకంటె భారత్ ఆరోగ్య రంగం క్షీణదశలో ఉన్నదన్నది తెలిస్తే మంత్రులు చెప్పే లెక్కల్లోని నిజాలేమిటో అర్థమవుతుంది. మన నేతలు ఒక్క శిశువు కూడా మరణించని ప్రభుత్వ ఆసుపత్రిని చూపించగలిగినప్పుడే వారు సమర్థంగా పనిచేస్తున్నట్లు చెప్పాలి. ■

గోవుల ఘోష!

అక్రమ రవాణా ఆగేదెలా?



కవర్‌స్టోరీ

పెట్ల వెంకటేశం

భారత్‌లో అధిక సంఖ్యాకులు ఆవును అతి పవిత్రంగా భావిస్తారు. కారణం శ్రీకృష్ణుడు గోపాలుడు కావడం, అలాగే నంది శివుడి వాహనం కావడం. అలాగే పురాణాల ప్రకారం కోరినవన్నీ ప్రసాదించేది కామధేనువు. ఇవన్నీ అటుంచి, ఆవు మనిషికి తన సర్వస్వాన్నీ అర్పిస్తుంది. ఓ సీనియర్ సినీ రచయిత గోవు విశిష్టతను ' వినరా, వినరా నరుడా..'అంటూ ఆవు మనిషికి చేసే సేవ మొత్తాన్ని చక్కని పాటగా అందించారు. మంచికి మారుపేరు గోవుగా భావిస్తారు. అందుకే సాధుస్వభావం కలవారిని 'గంగిగోవులాంటి వాడు' అనటం పరిపాటి. అటువంటి ఆవులను కేవలం వ్యాపార ధోరణితో అమానుషంగా హింసిస్తూ, ఇతర దేశాలకు అక్రమ రవాణా చేయడం..అది రోజురోజుకీ మితిమీరడం.. అంతటా కలవరం కలిగిస్తోంది. దేశంలో గోరక్షణ చట్టాలు, వాటి అమలు తీరు, స్మగ్లర్ల దురాగతాలు..ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వగైరా అంశాలు ఈవారం మీకోసం...

పాడిపంటలకు ఆలవాలమైన భారతదేశంలో వ్యవసాయానికి ఎంత ప్రాధాన్యం ఉందో, పాడి పశువుల పోషణ, సంరక్షణకు కూడా అంతే ప్రాధాన్యం ఉంది. ఆలమందల కాపరిగా గోపాలుడు మనకు ఇతిహాసాల్లో ప్రత్యక్షమవుతాడు. భారతంలో గోవుల రక్షణకోసమే కౌరవులను పాండవులు ఎదిరించి పోరు జరిపేరు. అదే ఉత్తర గ్రోగహణంగా ప్రసిద్ధికెక్కింది. ఇవన్నీ అవలోకనం చేసుకుంటే భారతీయులకు గోవు తల్లి వంటిది. గోమాతలకు పూజలు చేసి ఆరాధించే సంస్కృతి మనదేశంలో ఉంది. ఈ నేపథ్యంలో గోవధను నిషేధిస్తూ చట్టాలు అమలులోకి వచ్చాయి. అయితే కేంద్రప్రభుత్వం ఇప్పుడు ఈ చట్టాలకు మరింత పదునుపెట్టింది. గోవధ సాగకుండా అడ్డుకోడానికి గోరక్షకులను ప్రత్యేకంగా నియమించింది. స్వచ్ఛందంగా ఈ బాధ్యతలు నిర్వర్తించడానికి ముందుకు వచ్చే గోరక్షకులకు పోలీస్‌లతో సమానంగా చర్యలు తీసుకునే అవకాశం కల్పించడానికి ప్రయత్నిస్తోంది. అయితే ప్రభుత్వం తీసుకొంటున్న ఈ చర్యలు దేశంలో కొన్ని వివాదాలకు దారితీస్తోంది. గోమాంసం వ్యాపారం చేసేవారికి, గోమాంసం భక్షించేవారికి ఇది మింగుడుపడడంలేదు. అయినా ప్రభుత్వం జంకడంలేదు. గట్టిగానే కఠినచర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని పురమాయిస్తోంది.

గోమాంస క్రయవిక్రయాలకు పేరుమోసిన పెద్ద మార్కెట్ బంగ్లాదేశ్. భారత్, నేపాల్ దేశాల నుంచి రోజూ మూడువేల గోవుల మందలు బంగ్లాదేశ్‌కు చేరుకొంటున్నాయి. ఏటా 5 బిలియన్ డాలర్ల వ్యాపారం బంగ్లాదేశ్ మార్కెట్‌లో జరుగుతోంది. ఒడిస్సా మీదుగా రోజూ 150..గోవులు బంగ్లాదేశ్‌కు తరలిపోతున్నాయి. వాటి విలువ నెలకు 150 కోట్ల రూపాయలు. తమిళనాడులోని కోయంబత్తూర్ చెక్‌పోస్టు మీదుగా వలయార్ మీదుగా కేరళకు 2.8 లక్షల గోసంతతి రవాణా అవుతోంది. ఒక్కొక్క ఆవు 30,000 టకాల (24వేల రూపాయలు) నుంచి 45,000 టకాలు (36వేల రూపాయలు) విలువచేస్తోంది. ఈద్ పండగ రోజునే 2 లక్షల టకాల (1.6 లక్షల రూపాయలు) ధర పలకడం విశేషం. గోవు తల ఒక్కటే 15,000 నుంచి 25,000 రూపాయల వరకు ధర పలుకుతుంది. దళారులు ఈ ఆవులను మరో 3 రెట్లు ఎక్కువ ధరలతో అమ్ముతుంటారు. గోవుమాంసం 250 నుంచి 400కిలోల వరకు ఉంటుంది. కిలో మాంసం 250 రూపాయలకు అమ్ముతారు.



పడవల్లో బంగ్లాదేశ్‌కు గోవుల తరలింపు..

దేశంలో గోవధ నిషేధం ఎంత కఠినంగా అమలవుతున్నా అంతకన్నా రెట్టింపుగా నిఘా కొనసాగుతున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు లంచాల ప్రలోభాలకు పైనుంచి కింద వరకు అధికార యంత్రాంగం లొంగిపోవడంతో గోమాంస విక్రయ మాఫియా తన అక్రమ రవాణాను యధేచ్ఛగా కొనసాగిస్తోంది. బీహార్‌లో రైలు రావడానికి ముందే రైల్వే క్రాసింగ్ గేట్‌ను తెరిచి తమ ట్రక్కులు వెళ్లడానికి వీలు కల్పించలేదన్న కోపంతో గోవుల స్మగ్లర్లు గేట్‌మేన్ వేళ్లు నరికివేశారు. హర్యానాలో గోవుల స్మగ్లర్లు తుపాకీలు దగ్గర పెట్టుకుని గోవులను స్మగ్లింగ్ చేస్తుంటారు. అడ్డుకున్నవారిపై విచక్షణా రహితంగా తుపాకీలతో కాల్పులు జరుపుతుంటారు.

హర్యానాలోని రేవారి ప్రాంతంలో ఇటువంటి దౌర్జన్యం ఇటీవల

జరిగింది. రాజస్థాన్ రిజిస్ట్రేషన్ నెంబరుతో ఉన్న ట్రక్కులో 17 గోవులను నార్‌నేట్‌నుంచి మేవార్‌కు తీసుకెళ్తుండగా పోలీస్‌లు, గోరక్షకులు అడ్డుకున్నారు. ట్రక్కులోని స్మగ్లర్లు వీరిపై కాల్పులు జరిపి తప్పించుకుని పారిపోడానికి ప్రయత్నించారు. వారిని 12కి.మీ.దూరం వరకు వెంబడించి పట్టుకోవలసివచ్చింది. హర్యానా, పంజాబ్ నుంచి గోవుల అక్రమరవాణా ఒక పథకం ప్రకారం సాగుతుంది. తమ రూటులో ఎక్కడ పోలీస్‌లు కానీ గోరక్షకులు కానీ ఉంటారో అలాంటి అడ్డంకులు ఎదురైతే ఎలా తప్పించుకోవాలో ముందుగా రెక్కీ నిర్వహిస్తారు. వారంలో ఏయే రోజుల్లో వెళ్తే ఇబ్బందులు ఉండవో ముందుగా నిర్ణయించుకుని బయలుదేరుతుంటారు. ఈ విషయంలో కొందరు పోలీస్ అధికారులు వీరికి సహకరించడం పరిపాటిగా వస్తోంది. తమ ప్రయాణం రెండుమూడు రోజుల పాటు సాగేలా అన్ని ఏర్పాట్లు చేసుకుంటారు. భారీ వాహనాలు, కంటైనర్లు సమకూర్చుకుని ఆవులు బయటకు కనపడకుండా కూరగాయలతో కంటైనర్లు నింపుతారు. ఒకేసారి 10 నుంచి 20 ట్రక్కులలో గోవులను రవాణా చేస్తుంటారు. ఈ ట్రక్కుల కంటే ముందుగా పైలట్ వెహికల్ బయలుదేరుతుంది. రెండు ఎకి.మీ.



దూరం వరకు వీరు రెక్కీ నిర్వహిస్తారు. ఆ పైలట్ వాహనంలో సాయుధులైన ముష్కరులు ఉంటారు. దారిలో ఏవైనా ఆటంకాలు ఉంటే సీక్రెట్ కోడ్ ద్వారా తమ వెనుక వస్తున్న ట్రక్కులకు తెలియజేస్తారు. సాధారణంగా వీరు రాత్రుళ్లు బయలు దేరుతారు. గయ, బీహార్ వరకు ఎక్కడా ఆగకుండా రవాణా సాగిస్తారు.. ఒక

అక్రమ రవాణాను అరికడుతున్న గోరక్షకులు!



గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్న గోరక్షకులకు క్షేత్రస్థాయిలో అనేక ఆటంకాలు, ప్రమాదాలు ఎదురవుతున్నాయి. హర్యానా రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల నుంచి ఉత్తరప్రదేశ్ మీదుగా కోల్‌కతాకు భారీ ఎత్తున గోవులు, బర్రెలు, ఎద్దులు, దూడలు దొంగచాటుగా రవాణా అవుతుండేవి. ఇప్పుడు గోరక్షక దళాల ఏర్పాటు తో చాలామంది అక్రమరవాణా ఆగింది. హర్యానా ప్రభుత్వం గత జూలైలో గోరక్షక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది. దీంతో ఆ రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా సాగే గోవుల తరలింపునకు, 75శాతం వరకు అడ్డుకట్ట పడింది. గుజరాత్‌లో కొందరు కళాకారులు గోరక్షణ చేయడానికి స్వచ్ఛందంగా ముందుకురావడం విశేషం. ఎటువంటి లాభాపేక్ష ఆశించకుండా రక్షకదళాలుగా పనిచేస్తున్నారు. గుజరాత్ జానపద గాయని అబిదా మీరే ఒకపక్క తన కార్యక్రమాలు నిర్వహిస్తూ మరోవంక గోరక్షక దళ సభ్యురాలిగా చురుకుగా పనిచేస్తున్నారు. అహ్మదాబాద్‌కు 100కి.మీ. దూరంలో ఆమె స్వగ్రామం సురేంద్రనగర్ ఉంది. ఆమె తన కొడుకుతో కలిసి జానపద కళాప్రదర్శనలు ఇస్తున్నా రాత్రి పగలు తేడా లేకుండా గోవుల అక్రమరవాణాను అడ్డుకోగలుగుతున్నారు. రాత్రి బాగా పొద్దుపోయాక కార్యక్రమాల నుంచి ఇంటికి తిరిగివస్తున్నపుడు గోవులతో లారీ కనిపిస్తే చాలు తల్లీకొడుకులిద్దరూ గోవులను రక్షించడమే పనిగా పెట్టుకున్నారు. గోవుల స్మగ్లర్లు వీరిని చూసి పరారయిన సంఘటనలు ఎన్నో జరిగాయి. మరికొందరు గోవులతో లారీ అక్కడే వదిలేసి పారిపోతుంటారు. ఆ గోవులను అధికారులకు అప్పగించే వరకు ఆమె ఇంటికి కూడా వెళ్లరు. హర్యానా పొరుగున పంజాబ్ రాష్ట్రంలో గోరక్షక దళాలున్నా అంత చొరవచూపడంలేదు. గోవుల తరలింపు సమాచారం అందినప్పుడే ఆ ప్రాంతానికి వెళ్లి వాహనాలను అడ్డుకొంటున్నారు. గత ఏడాది పంజాబ్‌లో గోవుల అక్రమరవాణాకు సంబంధించి 72 కేసులు మాత్రమే నమోదయ్యాయి. రాజస్థాన్‌లో గత పదేళ్లలో 6400 కేసులు నమోదయ్యాయి. కొందరిని అరెస్టుచేశారు. దక్షిణాదిలో మంగళూరులో గోరక్షణపై ఇంకా సరైన అవగాహనలేదు. ఇక్కడ గోరక్షక దళాల వ్యవస్థ అంటూ సరిగ్గా ఏర్పాటు కాలేదని గోరక్షణ ఉద్యమ కార్యకర్త సిటీ మాజీ పోలీస్ కమీషనర్ సుబ్రమణేశ్వరరావు పేర్కొన్నారు. అయితే గోవులను ఎవరైనా తరలిస్తున్నారని తెలియగానే వారిని అడ్డుకొంటున్నారు. గోరక్షకులుగా పనిచేస్తున్నవారిలో కొందరు హింసలకు, దాడులకు పాల్పడుతున్నారని, గోవుల తరలింపునకు కావలసిన అధికార ధ్రువపత్రాలు ఉన్నా, వాటిని పరిశీలించకుండా దూకుడుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. హర్యానా, కర్నాల్‌లో గతనెల గోరక్షక దళ సభ్యులు పోలీస్‌ల తీరులో ఎస్‌యువి వాహనంలో బయలుదేరి గోవుల వ్యాన్‌ను అడ్డుకున్నారు. అక్కడితో ఆగకుండా ఆ వ్యాను డ్రయివర్‌ను చంపేశారు. ఆ వ్యాన్ పంజాబ్ నుంచి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

దక్షిణాది రాష్ట్రాల్లో కొన్ని చోట్ల గోరక్షక దళాల వారు గోమాంసం, వ్యాపారులతో, మాఫియాతో చేతులు కలిపి అక్రమంగా సంపాదిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బెంగళూరుకు చెందిన గోమాంసం వ్యాపారి కాశిం ఫజ్లుర్ రెహ్మాన్ గోరక్షకులు మామూళ్లు పిండి, కేసులు కాకుండా చూస్తున్నారని, ఆ సమయంలో పోలీస్‌లు వస్తే లంచాల రేటు మరింత ఎక్కువగా పెంచుతుంటారని చెప్పారు. కర్ణాటక గోమాంసం, పౌల్ట్రీ మార్కెట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కసీం ఎజాబ్ అహ్మద్ ఖురేషి గోరక్షకులు కొంతమంది మాంసవ్యాపారులతో ఒప్పందాలు కుదుర్చుకుంటారని అయితే విక్రయదారునితో సంబంధాలు పెట్టుకోకుండా కథ నడిపిస్తుంటారని చెప్పారు. ఎప్పుడు, ఎక్కడ, ఏవిధంగా గోవులను తరలించారో వారు గుర్తుపెట్టుకుని ఆమేరకు భారీగా లంచాలు గుంజడం వారికి అలవాటైందని తెలిపారు.

పూట మధ్యలో విశ్రాంతి తీసుకున్న తరువాత మళ్లీ బయలుదేరి పశ్చిమబెంగాల్, అస్సాం కబేళాలకు గోవులను తరలిస్తారు.

పశువులను రవాణాచేసేవారు కొన్ని నింధనలు పాటించి 1978లో రూపొందించిన నిబంధనల ప్రకారం రవాణా చేసే లారీలలో పశువులకు కావలసిన దాణా, మంచినీళ్లు ఉండాలి. అవి వాహనాల నుంచి జారిపోకుండా గోడవలె రక్షణ తలుపులు ఉండాలి. కానీ స్మగ్లర్లు ఇవేవీ పాటించరు. లారీలు, ట్రక్కులు పూర్తిగా కాన్వాస్, టార్పాలిన్లతో మూసివేస్తారు. రవాణా చేసే పశువులకు వ్యాధులు ఏమీలేవని, వాకి ్సనేషన్ జరిగిందని నిర్ధారిస్తూ ధ్రువీకరించే సర్టిఫికెట్ ఉండాలి. అవి లేకుండా రవాణాకు అనుమతించకూడదు.



కానీ స్మగ్లర్లు లంచాలతో అందరినీ లోబరచుకోవడంలో సిద్ధహస్తులు. తమిళనాడులో లారీకి 500 రూపాయల వంతున లంచం ఇవ్వడం పరిపాటిగా జరుగుతోంది. అలా చేతులు తడవకుంటే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వరని కేరళ పశుసంవర్ధక శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధోధన్ చెప్పారు. ఒక్కో లారీలో 16 కన్నా ఎక్కువ సంఖ్యలో పశువులను తరలిస్తుంటారు. ఒక్కో పశువుకు 15 రూపాయల వంతున పన్ను కట్టవలసి ఉన్నా అదేం లేకుండా లంచంతో సరిపెడతారు.

చెక్‌పోస్టులను తప్పించుకుని ఎలా వెళ్లాలో స్మగ్లర్లకు తెలుసు. లారీకి 15వేల నుంచి 20వేలరూపాయల వరకు ముట్టచెబుతుంటారు. పంజాబ్, హర్యానా

వివిధ రాష్ట్రాల్లో గో రక్షక చట్టాల తీరు...

జమ్ము-కాశ్మీర్:
గోవులను చంపడం ఇక్కడ పెద్ద నేరం. ఈ నేరస్థులకు పదేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు. గోమాంసం కలిగి ఉంటే ఏడాది శిక్ష. బర్రెను చంపితే ఆ బర్రె విలువకు అయిదింతలు జరిమానా విధిస్తూ శిక్షిస్తారు.

చండీఘర్:
గోవును చంపినా, గోమాంసం భక్షించినా, నిల్వచేసినా, ఎవరికైనా ఇచ్చినా నేరమే. అలాగే బర్రెకు కూడా నిషేధం ఉంది.

ఢిల్లీ:
వ్యవసాయానికి ఉపయోగించే పశువులను వధించడం నేరం. ఆవు, దూడ, ఎద్దు, బర్రె ఏదైనా సరే వధించరాదు. వాటి మాంసాన్ని ఉంచరాదు.

ఒడిషా:
గోవధకు రెండేళ్ల జైలు, వెయ్యి రూపాయల జరిమానా. దేనికీ పనికిరాని ఎద్లు, ఆవులను కబేళాకు తరలించవచ్చు. అయితే కబేళాకు తరలించడానికి అనుమతించే సర్టిఫికెట్ ఉండాలి. వ్యాధులతో బాధపడుతున్న పశువులను వధించవచ్చు.

హిమాచల్ ప్రదేశ్:
గోవధకు 5 ఏళ్ల జైలుశిక్ష. పరిశోధనకోసం లేదా గోవు వ్యాధుల పాలైనా వధించడానికి అవకాశం ఉంటుంది.

హర్యానా: గోసంతతి ఏదైనా వ్యాధుల పాలయినా సరే వధించడానికి వీల్లేదు. గోవధకు 3 నుంచి 10 ఏళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు. లక్షరూపాయల వరకు జరిమానా విధిస్తారు. గోమాంసం, గోమాసం ఉత్పత్తులు, ఆవుల ఎగుమతి నిషేధం.

పంజాబ్:
ఎగుమతికోసం గోవులును వధించవచ్చు. అయితే ప్రభుత్వ పర్మిట్ ఉండాలి.

రాజస్థాన్:
గోవులను వధించినా, ఆ మాంసం కలిగి ఉన్నా, రవాణా చేసినా నేరాలుగానే పరిగణి స్తారు. పదేళ్ల జైలు, పదివేలరూపాయల వరకు జరిమానా విధిస్తారు.

బీహార్:
గోవులను, దూడలను వధించడం నేరం. ఎద్దులను, 15 ఏళ్లకు పైగా వయసు మళ్లిన ఎద్దులను వధించడానికి అనుమతిస్తారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆరునెలలు జైలు శిక్షతోపాటు 1000 రూపాయల జరిమానా విధిస్తారు.

జార్ఖండ్:



గోవధ, గోమాంస భక్షణ నిషేధం. ఈ నేరాలకు పాల్పడితే పదేళ్ల వరకు జైలు, పదివేల రూపాయల జరిమానా విధిస్తారు.

గుజరాత్:
గోవును, లేగదూడలను, ఎద్దులను వధించినా, రవాణా చేసినా, వాటి మాంసాన్ని విక్రయించినా నేరాలుగా పరిగణిస్తారు. ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తారు. 50వేల రూపాయల జరిమానా ఉంటుంది.

మధ్యప్రదేశ్:
గోసంతతిని వధించడం నిషేధం. బర్రెలను మాత్రం వధించవచ్చు. గోవధకు ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తారు.

తమిళనాడు:
ఆవు, దూడలను వధించడం నిషేధం. మూడేళ్ల వరకు జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తారు. ఎద్దుమాంస వినియోగం, వట్టిపోయిన విలువలేని పశువులను వధించవచ్చు.

ఉత్తర ప్రదేశ్:
గోవు, ఎద్దు, లేగదూడల వధ నిషేధం. వీటి మాంసాన్ని నిల్వచేయడం, భక్షించడం నేరమే. ఏడేళ్ల జైలు, పదివేలరూపాయల జరిమానా విధిస్తారు. బర్రెలనువధించవచ్చు. సీల్డు కంటైనర్ల ద్వారా దిగుమతి అయిన మాంసాన్ని విదేశీయులకు అందిస్తారు.

ఆంధ్ర, తెలంగాణ:
ఆవులను, దూడలను వధించడం నిషేధం. కబేళాకు పంపే పరిస్థితిలో ఉన్న ఎద్దులను, వధించడానికి అనుమతించే సర్టిఫికెట్ ఉంటే వధించవచ్చు. నిబంధన లు ఉల్లంఘిస్తే ఆరు నెలలు జైలు, వెయ్యి రూపాయల జరిమానా ఉంటుంది.

ఛత్తీస్ గఢ్:
గోవులు, బర్రెలు, దూడలు, ఎద్దులను వ5ధించరాదు. వాటి మాంసాన్ని కలిగి ఉండడం నిషేధం. వధించడానికి ఎగుమతి చేయడం నిషేధం, నేరస్తులకు ఏడేళ్ల జైలు, యాభైవేల వరకు జరిమానా విధిస్తారు.

మహారాష్ట్ర:
గోవధ, గోమాంస భక్షణ నిషేధం. ఐదేళ్ల జైలుశిక్ష, పదివేల రూపాయాల జరిమానా విధిస్తారు. బర్రెలను వధించడానికి అనుమతిస్తారు.

కర్ణాటక:
వయసుమళ్లిన, వ్యాధిగ్రస్తమైన గోవులను వధించవచ్చు.

అసోం:
గోవధ నిషేధం. అయితే కబేళాలకు పంపిం చి వధించడానికి సర్టిఫికెట్ ఉండాలి. ■

నుంచి 10,000 నుంచి 12000 వరకు గోవులు రవాణా అవుతుంటాయి. ఇలా రవాణా చేసే గోవుల మలద్వారం వద్ద, కళ్లల్లో కారం చల్లుతారు. ఎక్కువ దూరం ప్రయాణం చేయవలసి వస్తే గోవులు అటూ ఇటూ కదలకుండా ఉండడానికే ఈ చిట్కా అని వారు చెబుతుంటారు. లారీ అడుగుభాగాన పాలిథిన్ షీట్లను పరుస్తారు. గోవుల మలమూత్రాల విసర్జన అంతా దానిపైనే. వాటిని శుభ్రం చేసే పని ఉండదు. కర్ణాటకలోని దక్షిణ ప్రాంతంలో రైతులను ప్రలోభ పెట్టడానికి దళారులు రకరకాల వేషాలు వేస్తుంటారు. పోలీస్‌లుగా, లోకల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులుగా, గోరక్షకులుగా నటిస్తూ రైతులను నమ్మించి పాడి పశువులను కొనుగోలు చేస్తుంటారు. ఆ గోవులు కబేళాలలకు వెళ్తాయని వారికి తెలియకుండా జాగ్రత్త పడుతుంటారు. అసోం నుంచి బంగ్లాదేశ్‌కు నదిమీదుగా పాడి పశువుల అక్రమరవాణా ఎలా సాగుతుందో స్పష్టంగా బట్టబయలయ్యేలా గత నెల వీడియోలో దృశ్యాలు ప్రసారంకావడం సంచలనం కలిగించింది. కాళ్లకు తాళ్లు కట్టి గోవులను బంధించడమేగాక, గోమాం సాన్ని కూడా తరలించేదృశ్యాలు బయటపడ్డాయి. అసోం నుంచి బ్రహ్మపుత్రనది మీదుగా యథేచ్ఛగా గోవుల రవాణా సాగుతోంది. ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి గోవుల స్మగ్లర్లు బెంగాల్, అసోం సరిహద్దుప్రాంతాల్లో ప్రవేశిస్తుంటాయి. రాజస్థాన్, గుజరాత్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలనుంచి ఉత్తరప్రదేశ్ మీదుగా పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌ల్లో ప్రవేశిస్తుంటారు. ఇండో- బంగ్లాదేశ్ సరిహద్దునుంచి 200కి.మీ. దూరంలో మర్షిదా బాద్‌లో గోవుల స్మగ్లింగ్ సిండికేట్ పకడ్బందీగా సాగుతోంది. ఈ సిండికేట్ బంగ్లాదేశ్‌కు మూడు కేటగిరీల ద్వారా గోవులను తరలిస్తుం టాయి. వీటికి రంగుల కోడ్‌లు అతికిస్తారు. మూడు వెరైటీల్లో ఉత్తరాది నుంచే గోసంతతి ఎక్కువగా వస్తుంది. తూర్పు ఉత్తర ప్రదేశ్, బీహార్ నుంచి మధ్యస్థ వెరైటీ పాడి పశువులు వస్తుంటాయి. బెంగాల్ నుంచి వచ్చే గోసంతతి చిన్న తరహా వెరైటీతో ఉంటుంది. ఈ తరహా వెరైటీ గోవులు గిట్టుబాటు కావని అంటుంటారు.



స్మగ్లర్లు చాలా వరకు మీడియం సైజ్ గోవుల పేనే ఆధారపడతారు. జార్ఖండ్. బంగ్లాదేశ్ సరిహద్దులో కిషాన్ గంజ్ పశువుల మార్కెట్ ఉంది. ఇక్కడనుంచి రోజూ సాయంత్రం పూట గంగానది మీదుగా బంగ్లాదేశ్‌లోని చపాయి నవాజ్ గంజ్‌కు గోవులు చేరుకుంటాయి. అక్కడి ఏజెంట్లు వీటిని మూడురెట్లు ఎక్కువ ధరతో అమ్ముతుంటారు. బంగ్లాదేశ్ మీదుగా సరిహద్దు దాటుతుండగా కొన్ని దుర్ఘటనలు జరుగుతుంటాయి. సరిహద్దు భద్రతా దళాల కాల్పులకు గురయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. 2014లో ఆరుగురు గోవుల స్మగ్లర్లను, 2019లో 17 మందిని భద్రతాదళాలు కాల్చి చంపాయి. గత ఏడాది భారత్- బంగ్లాదేశ్ సరిహద్దులో 1.78 లక్షల గోవుల మందను పట్టుకున్నారు. ప.బెంగాల్ నుంచి భారీగా గోవుల మందలు 76 శాతం రవాణా అవుతుంటాయి. 2013 నుంచి 50,000 వరకు పట్టివేతలు సాగాయి. ఒరిస్సాలోని బాలసోర్ జిల్లా కూడా గోమాంస క్రయవిక్రయాల మార్కెట్ కేంద్రంగా వర్ధిల్లుతోంది. ఖుర్దా, కటక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్ర పార, డెంకనాల్, అంగుర్, జైపూర్, భద్రక్ ప్రాంతాల నుంచి కూడా గోవుల అక్రమ రవాణా సాగుతుంది. పూరి, గంజాం, కొరాపుట్, రాయగఢ్, మల్కనగిరి ప్రాంతాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కబేళాలకు పశువులు వెళ్తుంటాయి. ఒడిషాకు చేరువగా 300 పశువుల మార్కెట్లు ఉండడం విశేషం. ఇవికాక మరో 100 మార్కెట్లు ప్రైవేట్‌గా నడుస్తున్నాయి. ఒడిషా నుంచి రోజూ 150 ట్రక్కుల లోడ్‌తో బంగ్లాదేశ్‌కు పశువులు వెళ్తుంటాయి. నెలవారీగా 150 కోట్ల రూపాయలకు పైగా ఇక్కడ వ్యాపారం సాగుతుంది. దేశం మొత్తం మీద తెలంగాణ రాష్ట్రంలో గోమాంసాన్ని ఆరగించే వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. పురుషుల్లో 98.8శాతం, మహిళల్లో 98.6శాతం మంది గోమాంసం రుచిచూస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పరిసర ప్రాంతాలనుంచి గోవుల చోరీ కూడా ముమ్మరంగా జరుగు తోంది. గత మేనెలలో దొంగిలించిన 40గోవులతో వ్యానువెళ్తుండగా పోలీస్‌లు పట్టుకున్నారు. నిందితుడు 28ఏళ్ల మొహమ్మద్ అయిజాజ్‌ను సైబరాబాద్ పోలీసులు పట్టుకుని అరెస్టుచేశారు. ఈ గ్యాంగ్ దొంగిలించిన ఆవులను నగరపొలిమేరల్లో అక్రమంగా అమ్ముతుంటారు. ఆగస్టు 7వ తేదీ రాత్రి బీబీనగర్ వద్ద వ్యానులో 23 ఎద్దులను తరలిస్తుండగా పోలీస్‌లు, గోరక్షకులు పట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లా హర్పి వద్ద ఎద్దులను కొనుగోలుచేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఈ దాడి జరిగింది. కబేళాకు తరలిస్తున్న 23 ఎద్దులకు సంబంధించి సరయిన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో పోలీస్‌లు ఆ ఎద్దులను వనస్థలిపురం వద్దగల గోశాలకు తరలించారు. తమిళనాడులో వంద పశువుల సంతలు వారంవారం జరుగు తుంటాయి. ఈ సంతల్లో 53,000 రూపాయల పశువుల వ్యాపారం జరుగుతోంది. ఏటా కనీసం 2.5 లక్షల గోవులు, ఎద్దులు, బర్రెలు కేరళకు రవాణా అవుతుంటాయి. ఏమైనా గోరక్షక చట్టాలను నిబద్ధతతో అమలుచేయవలసి ఉంది.

ఆవులకు 'ఆధార్' ట్యాగ్

మన అందరికీ ఆధార్ కార్డులున్నట్లే ఆవులకు కూడా ఆధార్‌వంటి గుర్తింపు కార్డులను అమలుచేయడానికి జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమయింది. ఆవు కొమ్ములు, చర్మంరంగు, తోక తదితర వివరాలన్నీ కార్డులో పొందుపరుస్తారు. ప్రస్తుతం 12,000 ఆవులకు దీన్ని అమలుచేస్తున్నారు. ఏడాదిలోగా 18లక్షలకు పైగా ఆవులమందలకు ఆధార్ కార్డుతో అనుసం ధానం చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. ఆవులను ఎవరూ అక్రమంగా తరలించుకుపోకుండా నివారించడానికి, వాటి ఆరోగ్యం అభివృద్ధిచెందడానికి, పాల దిగుబడి మరింత పెరగడానికి ఈ ఆధార్' గుర్తింపుకార్డు అనుసంధానం ఉపయోగపడుతుందని జార్ఖండ్‌ప్రభుత్వం చెబుతోంది. దేశం మొత్తంమీద ఉన్న గోసంతతికి గుర్తింపు టాగ్స్ అనుసంధానిస్తామని కేంద్రప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వంలో భాగంగా పనిచేస్తున్న జార్ఖండ్ స్టేట్ ఇంప్లిమెంట్ ఏజెన్సీ ఫర్ కేటిల్ అండ్ బఫెలో ఈ ప్రక్రియకు సంబంధించి పైలట్ ప్రాజెక్టుపై పని చేస్తోంది. రాంచి, హారీబాగ్, ధన్‌బాద్, బొకారో, జెంషెడ్‌పూర్, డియోఘర్, గిరిదిహ్, లోహర్‌దేగ..తదితర ఎనిమిది జిల్లాల్లోని ఆవులకు ఆధార్‌వంటి ట్యాగ్‌లను అమరుస్తారు. కేంద్రం ప్రతిపాదించకముందే ఈప్రక్రియను జార్ఖండ్‌లో అమలుచేయడానికి ప్రయత్నించడం విశేషం. ఈ పైలట్ ప్రాజెక్టు కేంద్రప్రభుత్వ ఐఎన్ఎపిహెచ్ (ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్ ఫర్ యానిమల్ ప్రొడక్టివిటీ అండ్ హెల్త్) పథకం కింద గత ఏడాదిగా జార్ఖండ్‌లో పనిచేస్తోంది. నోడల్ ఇన్‌చార్జి కె.కె.తివారి మాట్లాడుతూ ప్రతి ఆవుకు 12 డిజిట్ యుఐడి నెంబర్లతో టాగ్ అనుసంధానమవుతుందని, చెవుల చుట్టూ ఈ ట్యాగ్ అమరుస్తారని చెప్పారు.



నమ్మిన దారిలో నడవటం..

'ఒరేయ్ శ్రీనూ...నిన్న సాఫ్ట్‌వేర్ బూమ్ ఉంది. ఈరోజు లేదు. అలాగే ఈరోజు ఎలక్ట్రానిక్ మీడియా స్టార్‌డమ్‌లో ఉంది. రేపు ఇది ఉంటుందో లేదో తెలియదు. కానీ తెలివైన వాడెప్పుడూ డిమాండ్ నాడి పట్టుకుని ఎదుగుతూ ఉంటాడు. నచ్చింది, నమ్మింది అంటూ విడిగా ఏం ఉండవు. దేనికి సంపాదన ఉంటుందో చూసుకుని దొచ్చుకుపోవడమే సక్సెస్ అంటే. అర్థమైందా?'

'చూడు చిన్నా...ఈ మ్యూజిక్, యాక్టింగ్ మన కడుపులు నింపవు. నేను నీమీద నమ్మకం ఉంచడం కన్నా ప్రపంచం నిన్ను నమ్మడమే ముఖ్యం. ఇప్పటికే ఈ రంగాల్లో తలపండిన వాళ్లు ఉన్నారు. అందరికీ దీటుగా ఈ పోటీలో నిలబడటం చాలా కష్టం. వచ్చిన జాబ్‌లో జాయిన్ అయిపో..'

మన చుట్టూ ఇలా హితబోధలు చేసేవారిని మనం నిత్యం చూస్తూనే ఉంటాం. జీవితం అనేది ఒక్కొక్కరికి ఒక్కోరకంగా ఉంటుంది. ఏ ఒక్కరి లక్ష్యాలు, కలలు ఇంకొకరితో పోసగాల్సిన అవసరం లేదు. ఎంచుకునే రంగాలు ఒకటవ్వచ్చు కానీ దానిమీద వ్యక్తులకు ఉండే అనురక్తి మాత్రం ప్రవృత్తులపై ఆధారపడి ఉంటుంది.



సహజంగా మన జీవితం మన చేతుల్లోనే ఉంది అని మనం అనుకుంటాం. కానీ అది పరిసరాల, కుటుంబ ప్రభావాల చేతుల్లో ఎక్కువ చిక్కుకుని ఉంటుంది. మనం నిరంతరం మన ప్రవృత్తి నిర్దేశిత మార్గంలో పయనించడం అన్నది మన మనోధైర్యంపైనే ఆధారపడి ఉంటుంది.

నమ్మినదారిలో నడవటం, నచ్చింది చేయటం అన్నింటికన్నా క్లిష్టమైన అంశాలు. అందులోనూ మనకు నచ్చింది అందరి ఆమోదం పొందేది అయితే మన జీవితం సాఫీగానే ఉంటుంది. కానీ అది కాస్త వినూత్నమైనది, అందరి అభిరుచులకి భిన్నమైనది అయితే మాత్రం నిజమైన యుద్ధం అప్పుడే మొదలవుతుంది.

అందరికీ నచ్చాలంటే...

మనం నమ్మిన దారి కొత్తదై, దాన్ని అందరూ గుర్తించి, మనం కూడా విజేతల చిట్టాలో ఉండాలంటే దానికి కొన్ని దశలున్నాయి. ప్రతి దశలో మనం ఎంత దృఢంగా ఉన్నాం అన్నదానిమీదే మన విజయం ఆధారపడి ఉంటుంది.

ప్రిపరేషన్ పీరియడ్

ఈదశలో మనకు నచ్చినదేమిటో స్పష్టంగా ఓ అవగాహనకి రావాలి. అలవాట్లు, అభిరుచులు, దృఢంగా నమ్మిన లక్ష్యం వీటి మధ్య ఉండే తేడాను గుర్తించాలి. ఆ తేడాను గుర్తించి ఆ నచ్చిన అంశాన్ని లక్ష్యంగా మలచుకోవాలి. దాన్ని పేపర్ మీద పెట్టాలి. వ్యక్తిగతంగా మిమ్మల్ని మీరు ఆ లక్ష్యం విజయాన్ని గురించి సహేతుకంగా కన్విన్స్ చేసుకోగలగాలి. స్వీయ అవగాహన దృఢంగా ఉండటమే ఈ దశలోని కీలకాంశం.

పిక్చర్స్ పీరియడ్

ఒక్కసారి ఆ లక్ష్యం ఏంటో తెలిశాక, దానిలో చేయదగ్గ ప్రయోగాలు ఏమిటో ఊహాచిత్రంలో చూడాలి. అదే వృత్తిలో ఉండి విజేతలైనవారు చేసిన ప్రయోగాల్ని నిశితంగా పరిశీలించాలి. ఆ లక్ష్యంపై మీ ఇష్టాన్ని బలపరచుకోవాలి. ఆ ఇష్టమే మిమ్మల్ని సరికొత్త ప్రయోగాలకు ప్రేరేపిస్తుంది. ఆ ప్రయోగాల దృశ్యాల్ని పుస్తకంపై బొమ్మల్లోనో, గీతల్లోనో పెట్టండి..మీ లక్ష్యంపై ఇష్టాన్ని మరికాస్త పెంచే ప్రక్రియే ఇది.

ప్లానింగ్ పీరియడ్

ఇప్పుడు ఇక ఎక్కడ, ఎలా మొదలుపెట్టాలి అన్న అంశంపై స్పష్టత తెచ్చుకోవాలి. ఖర్చులు దానిమీద ఎంత పెట్టాల్సి రావచ్చో ఓ అంచనాకు రావాలి. ఎంతకాలం శ్రమించాక ఆదాయం వస్తుందో కూడా ఉజ్జాయింపుగా తెలుసుకోగలిగిఉండాలి. ప్లాన్ చేసిన ప్రతిసారి ప్లాన్ ఎ, ప్లాన్ బి, ప్లాన్ సి అని మొదట ఓ నెలకు చేసుకోవాలి. తర్వాత విజయ వైఫల్యాల్ని బట్టి మార్చుకుంటూ ఉండాలి.

ఇండిపెండెంట్ పీరియడ్

ఒక్కసారి ప్లానింగ్ అయిపోయాక ఖర్చులు, ఇతర అవసరాలు తీరడానికి ఓ పార్ట్‌టైమ్ వనరుని ఎంచుకోవాలి. అది ఖచ్చితంగా మీ లక్ష్యానికి దగ్గర చేసే నైపుణ్యాన్ని మెరుగుపరిచేలా ఉండాలి. ఓ కొత్త దారిలో నడుస్తున్నప్పుడు ఎందరో నిరుత్సాహపరచడం సర్వసాధారణం. అలాంటి పరిస్థితుల్లో మన కనీస అవసరాల విషయంలో మనం స్వతంత్రులం అయి ఉంటే అది మన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

స్ట్రగులింగ్ పీరియడ్

ఒక్కసారి లక్ష్యంవైపు అడుగులు వేయడం మొదలెట్టాక వైఫల్యాలు కూడా రావచ్చు. ఎందుకంటే అన్ని ప్రయోగాలు దీర్ఘదృష్టితో సాగక పోవచ్చు. వైఫల్యాల్ని తట్టుకుని, స్ట్రగులింగ్ పీరియడ్‌లో ముందుకు సాగడమే అన్నింటికన్నా కీలకాంశం. చాలామంది ఇక్కడే వెనుదిరుగుతారు. ఇక్కడ నిలబడ గలిగితే ఖచ్చితంగా విజయం మీదే.

సక్సెస్ పీరియడ్

ఇక మిగిలింది విజయలక్ష్మి మిమ్మల్ని వరించడమే. ఒక్కసారి విజయం వచ్చిన దాన్ని నిలబెట్టుకోవడం ఇంకా ముఖ్యం. సక్సెస్ పీరియడ్ అంటే ఒకే స్థితిలో ఉండిపోవడంకదా. ఇంకో తరహా సక్సెస్ కోసం కొత్తగా ప్రయత్నించటం.


అమలు చెయ్యటానికి సిద్ధంగా ఉన్న ఆలోచన కన్నా శక్తివంతమైనది ఏదీలేదు. అటువంటి ఆలోచనకు నమ్మకం అనే ఆయువును పోసి, లక్ష్యంగా మలచుకొని విజయలక్ష్మి వరించేవరకు పోరాడితే ప్రపంచమే మిమ్మల్ని గుర్తిస్తుంది విజేతగా!

–శృంగవరపు రచన



కృతి

సమాజాన్ని తట్టిలేపే కవిత్వం




కవన రంగానికి సాబిర్ కొత్తవాడేం కాదు. 'ఒక దేశ ద్రోహి ప్రేమకథ' ఆయన నాల్గవ కవితాపొత్తం. దేశంలో పెట్రేగిపోతున్న దళిత, ఆదివాసి, మైనారిటీలపై దాష్టికాలను ఎదిరించడం, అక్షరమే ఆయుధంగా పోరాడటం దేశద్రోహమవుతుందా? అని ప్రశ్నిస్తున్నాడు. మతోన్మాద శక్తులపై తన కవితాస్త్రాలను సంధిస్తున్నాడు. 'మొహర్రా మసీదుపై పూచిన/ అత్తరు పుష్పాన్ని/ అత్తరు సాయిబుని' అని తన అస్తిత్వాన్ని చాటుకుంటున్న సాబిర్ 'ఆకాశంలో సగం కాదురా/ ఆమే సంపూర్ణాకాశం' అంటూ స్త్రీని అభివర్ణిస్తాడు. 'మరణం/ ఒక పతాక సన్నివేశం మాత్రమే/ అదే చివరి దృశ్యమౌతుంది/ చివరికదే అదృశ్యమౌతుంది' అని తాత్త్విక నిర్వచనం ఆవిష్కరించగల ప్రతిభావంతుడు. కవిత్వమంటే సాబిర్‌కు అమితమైన ప్రేమ. రాయడం బాధ్యత. అనాథలు, అభాగ్యులు, గిరిజనులు, బహుజనులు, నల్లవాళ్లు, నలిగిపోయిన వాళ్లు, మొహల్లాలు, వాడలూ..యివీ ఆయన కవితా వస్తువులు. వీళ్ల తరపునే ఆయన పోరాటం. వారిపట్ల ప్రేమ కవిత్వమైపొంగుతుంది. పాలకులకు కంటకమై ఆయన్నో దేశద్రోహిగా నిలబెడుతుంది. ప్రజాస్వామిక, లౌకికశక్తులతో మమేకమైన సాబిర్ అక్షరాలు నిప్పుకణికల్లా ప్రజ్వరిల్లుతాయి. కేవలం ముస్లిములనేకాదు.. సుషుప్తావస్థలోని యావత్ సమాజాన్ని తట్టిలేపుతుంది ఆయన కవిత్వం.

(ఒక దేశద్రోహి ప్రేమకథ:సాబిర్ కవిత్వం; వెల: రూ.100; ప్రతులకు: సయ్యద్ సాబిర్ హుసేన్, డోర్ నెం.22-143,కట్ట కింద బజారు, వినుకొండ -522647, గుంటూరుజిల్లా, ఆం.ప్ర.)

-రమణ వెలమకన్ని

మహిళలకు మేలు చేసే పుస్తకం..



భారతీయ మహిళల్లో తమ శరీరం గురించిన అవగాహన చాలా అరుదు. శరీరావయవాలగురించి బహిరంగంగా ప్రస్తావించటమే తప్పని భావిస్తుంటారు. ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినపుడు వైద్యుణ్ని సంప్రదించడం, వారు చెప్పినదానికి తలూపేయటం చేస్తుంటారు. ఈ కారణంవల్లనే గత కొన్నేళ్లుగా స్త్రీలలో గర్భసంచి తొలగింపు మామూలయిపోయింది. దాంతోపాటు అండాశయాలు సైతం తొలగింపుకు గురవుతున్నాయి. ఫలితంగా ఆ మహిళల్లో శరీరారోగ్యం ఘోరంగా దెబ్బతింటోంది. వైద్యులు స్వలాభంకోసం హిస్టరెక్టమీ ఆపరేషన్లు అసంఖ్యాకంగా చేసేస్తున్న నేపథ్యంలో ఈ విషయమై అందరిలో చైతన్యంతీసుకురావాలనే తపనతో డా.సామవేదం వెంకట కామేశ్వరి, భర్త డా.వింజమూరి సూర్యప్రకాష్‌తో కలిసి లైఫ్- హెచ్.ఆర్.జి. (లైఫ్- హెల్త్ రీఇన్‌ఫోర్స్‌మెంట్ గ్రూప్) సంస్థను 1999లో ప్రారంభించారు. డా. కామేశ్వరి తాజాగా 'గర్భసంచిని కాపాడుకుందాం.. సమాజాన్ని బలపరుద్దాం' అనే ఓ మంచి పుస్తకాన్ని విడుదల చేశారు. సైన్స్ పరిజ్ఞానంలేని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా చాలా సులభశైలిలో గర్భసంచి ప్రాధాన్యత, గర్భసంచి- అండాశయాల సంబంధం, పాప్‌స్మియర్ పరీక్ష ప్రాధాన్యత.. వగైరాలను ఎంతో విపులంగా వివరించారు. మహిళలే కాదు, ప్రతిఒక్కరూ చదవాల్సిన పుస్తకమిది.

(గర్భసంచిని కాపాడుకుందాం..సమాజాన్ని బలపరుద్దాం: డా.సామవేదం వేంకట కామేశ్వరి; వెల:అమూల్యం; ప్రతులకు: అమర్ ప్రేమాలయం, ఇంటినెం.10-16, ఎస్‌బిఐ, రోడ్‌నెం.2, కొత్తపేట, హైదరాబాద్, తెలంగాణ-500035)

-జె.శ్యామల

అధ్యయన విద్యార్థులకు కరదీపిక



కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భావం, పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి వంటి అపూర్వ వ్యక్తుల త్యాగాలు, పార్టీ నిర్మాణం. ఆంధ్ర ఆవిర్భావం కోసం పోరాటాలు, మరోవైపు దేశ స్వాతంత్ర్యోద్యమం, తమిళనాట అసెంబ్లీలో కమ్యూనిస్ట్ పక్షాల పోరాటం, కమ్యూనిస్ట్ ఉద్యమాల కీలక దశలు, మహిళా పోరాటాలు, 1932 సహాయ నిరాకరణోద్యమం, ఇలా ఎన్నో అంశాలు 'ఆంధ్రరాష్ట్రంలో వామపక్ష ఉద్యమ చరిత్ర' పుస్తకంలో చర్చించారు డా. కె.రమేష్. దాదాపు 8 అధ్యాయాలుగా ఈ గ్రంథంలో సామాజిక, సాంస్కృతిక ఉద్యమాల పట్ల వామపక్ష పార్టీ వైఖరి, వామపక్ష సైద్ధాంతిక, రాజకీయ ప్రాబల్యం, కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు..ప్రభుత్వ-ప్రతిపక్షాల తీరుతెన్నులు ఎంతో విపులంగా రాశారు. ట్రేడ్ యూనియన్, విద్యార్థి, యువజన, రైతాంగ, మహిళా ఉద్యమాల్ని నిర్మించడంలోనూ, సాంస్కృతిక దళాల్నీ, సాహితీ సమాఖ్యల్ని తీర్చిదిద్దడంలోను కమ్యూనిస్టుల అకుంఠిత దీక్ష, అంకిత భావం, చొరవ, వారి అపార శక్తియుక్తుల్ని చక్కగా తెలియజేశారు. విశాలాంధ్ర నినాదం, యునైటెడ్ ఫ్రంట్, ఎన్నికల వ్యూహాలు, సాహితీ-సాంస్కృతికోద్యమం, మా భూమి వంటి నాటిక ప్రదర్శనలు, భాషోద్యమం రష్యన్ విప్లవ ప్రభావం, కమ్యూనిస్ట్ ఉద్యమం ..అంశాలు చరిత్ర అధ్యయన విద్యార్థులకు, రాజకీయవేత్తలకు చక్కటి కరదీపికగా నిలుస్తుంది ఈ గ్రంథం.

(ఆంధ్రరాష్ట్రంలో వామపక్ష ఉద్యమ చరిత్ర 1934-56; డా.కె.రమేష్ వెల:రూ.160; ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు)

-తంగిరాల చక్రవర్తి

చిత్తాలనలరించే 'చిత్రాల' పొత్తం!



ఛాయాచిత్రాలు ఎన్నయినా ఉండవచ్చు. కానీ కళాకారుడు చిత్రించే పోర్ట్రెట్‌లు చాలా ప్రత్యేకమైనవి. ఆ దృష్ట్యా సత్తిరాజు శంకర్ నారాయణ అందించిన 'కలంరేఖలు' పుస్తకం విలువైందిగా చెప్పవచ్చు. చిత్రకారుడనగానే గుర్తుకొచ్చే బాపుగారి సోదరుడు శంకర్ నారాయణ. ఆకాశవాణిలో ఉద్యోగం చేస్తూనే తన చిత్రకళను సాధనచేస్తూ ఎన్నో పెన్సిల్ స్కెచ్‌లు వేశారు. తాను వేసిన సినీ ప్రముఖుల పోర్ట్రెట్‌లతో ఇంతకుముందు 'హాసరేఖలు' పేరిట ఓ పుస్తకాన్ని, సంగీత కళాకారుల పోర్ట్రెట్‌లతో 'నాదరేఖలు' పుస్తకాన్ని వెలువరించారు. ఇప్పుడు తాజాగా 'కలం రేఖలు'. ఇందులో 197మంది సాహితీవేత్తల పోర్ట్రెట్‌లు వారి గురించిన సంక్షిప్త పరిచయాలు ఉన్నాయి. సంక్షిప్త పరిచయాలను ముళ్లపూడి వెంకటరమణగారి సతీమణి శ్రీదేవి అందించటం మరో విశేషం. అటు చిత్రకారులకు, ఇటు సాహితీవేత్తలకు, సాహిత్యాభిమానులు, చిత్రకళాభిమానులైన ప్రజలందరికీ ఈ పుస్తకం ఎంతో ఆసక్తిని కలిగిస్తుందని చెప్పవచ్చు. ఆదికవి నన్నయ్య నుంచి హరిపురుషోత్తమరావు వరకు ఎందరెందరో కలంకారుల అపురూప రేఖాచిత్రాలను అందించిన సత్తిరాజు శంకర్ నారాయణ అభినందనీయులు.

(S.శంకర్ నారాయణ కలం రేఖలు..ఆదికవినుంచి...ఆధునిక రచయితల వరకు; రచన: ముళ్లపూడి శ్రీదేవి; వెల:రూ.200; ప్రతులకు:నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్)

-ప్రభాస



ప్రేమ.. ఓ అనంత భావన

కస్తూరి మురళీకృష్ణ

గురులకు శిష్యులు పుత్రులు। పరమార్థమలోక ధర్మపథమిది: దీనిం బరికింపక యీ పలుకులు। తరుణీ। గురుపుత్రి। నీకు దగునే పలుకన్.

ఆ మాటలు విని నిర్ఘాంతపోయి నిలుచుంది దేవయాని.

ఆమె కళ్లలోకి నీళ్లు పొంగుకువచ్చాయి.

ఒక్కసారిగా ఆమె కన్న కలలన్నీ కల్లలవుతున్న దృశ్యం ఆమె మనస్సులో కదిలింది. ఆమె కట్టుకున్న ఊహా సౌధాలు కూలిపోతున్న భావన కలిగింది. ఆమె సృజించుకున్న ఆశాప్రపంచాలు నాశనమయి పోతున్నట్లు అనిపించింది.

ఆమె తనని తాను నియంత్రించుకుంది. ఆమెకు జీవితంలో ఇంతవరకూ తానన్నదాన్ని కాదన్న అనుభవంలేదు. తాను కోరినదాన్ని పొందకపోవటం అంటూ లేదు.

ఆమెకు ఏడుపు వచ్చింది. కంటినుండి నీరు జలజలరాలింది. కన్నీళ్ల నడుమ కచుడివైపు చూసింది.

నిర్భావంగా, రాయిలా నుంచుని ఉన్నాడు కచుడు.

రాయిలా ఉన్న అతడు తన కన్నీటికి కూడా కరగకపోవటం ఆమెకు కోపం తెప్పించింది.

ఆమె తండ్రి ఎలాంటి పరిస్థితిలో ఉన్నా దేవయాని కన్నీటికి కరిగిపోయేవాడు. ఎంతటి పట్టుదలనయినా వదిలివేసేవాడు. ఆమె కోరింది ఇచ్చేవాడు.

ఇది ఆమె జీవితంలో మొదటిసారి ఇలా తాను కోరింది లభించకపోవటం. తన కన్నీరు చూసి కూడా చలించకపోవటం. కోపాన్ని అణచుకుంటూ, దుఃఖాన్ని నియంత్రించుకుంటూ అడిగింది.

ఇప్పుడు గుర్తుకు వచ్చిందా నీకు నేను గురుపత్రికనని? ఇప్పుడు.. ఇప్పుడు గుర్తుకు వచ్చిందా గురువుకు శిష్యులు పుత్రుల వంటివారని? అడవినుండి రోజూ నాకోసం పువ్వులు ఏరుకువచ్చి నాకు సమర్పించినప్పుడు నేను సోదరి సమానురాలినని తెలియదా? నాకు సేవలు చేసి, నాతోపాటు ఒంటరిగా అడవిలో విహారం చేసినప్పుడు, సాయంకాలాలు కబుర్లు చెప్పినప్పుడు, రాత్రిళ్ల వెన్నెల వెలుగులో ఒకరి కళ్లల్లోకి ఒకళ్లు చూసుకుంటూ గడిపినప్పుడు నేను గురుపుత్రికనని, నీకు గురువు తండ్రిలాంటివాడని గుర్తుకురాలేదా? నాలో ప్రేమ భావనలు జాగృతం చేసి, నా మనస్సులో స్థానం ఏర్పరచుకున్నప్పుడు నీకు నేను సోదరి సమానని గుర్తుకు రాలేదా?' రోషకషాయిత నేత్రాలతో అడిగింది.

కచుడు కదలలేదు. పెదవి విప్పలేదు. రాయిలా నిలుచున్నాడు.

'నాకు ఇప్పుడు అర్థం అవుతోంది' అంది దేవయాని కోపంగా.

కనురెప్ప వాల్చకుండా నిర్భావంగా ఆమెవైపు చూస్తూ నిలుచున్నాడు కచుడు.

'ఇప్పుడు నిజంగా నాకు అర్థమవుతోంది. నువ్వు మోసగాడివి. నువ్వు పైకి కనిపించినంత నిజాయితీపరుడివి కాదు. నువ్వు నటుడివి. ఇంతకాలం నవ్వు నటించావు. నా తండ్రితో నువ్వు నటించావు. నాతో నువ్వు నటించావు. తండ్రిపైని గౌరవం, భక్తి, వినయం, అంతా నటన. నాపట్ల చూపిన శ్రద్ధ, అభిమానం, అనురాగం అంతా బూటకం. అంతేనా?'

కచుడు మౌనంగా ఉన్నాడు. ఆమె మాటలకు అతనిలో ఎలాంటి స్పందన కనిపించటంలేదు. అది ఆమెలో కోపాన్ని మరింత రగులుస్తోంది. అతడికి వీలయినంత బాధ కలిగించాలనిపిస్తోంది. అతడిలో ఏదో ఓ రూపంగా, ఏదో ఓ స్పందన చూడాలనిపిస్తోంది.

'నువ్వు బృహస్పతి కొడుకువని నాన్నగారు ఎంతో గౌరవించారు. ఆదరించారు. కానీ నువ్వు మనసునిండా విషం నింపుకుని వచ్చావని గ్రహించలేకపోయారు. గ్రహించినా పైకి నువ్వు చెప్పలేదు. నువ్వు వచ్చింది తండ్రిగారి దగ్గర నుంచి మృత సంజీవని విద్యను సంగ్రహించటానికి. అంతేనా?'

ఆమె 'మృత సంజీవని' ప్రసక్తి తేగానే కచుడి కళ్లల్లో ఒక భావం అలవోకగా కదిలి మాయమయింది.

అది గమనించిందామె. తాను సరైన విషయాన్ని స్పృశించానని అర్థమయింది. 'నీకు మా తండ్రిగారి బలహీనత నేనని తెలుసు. నేను అడిగింది ఆయన కాదనరని తెలుసు. నా కన్నీళ్లకు ఆయన కరిగి నీరవుతారని తెలుసు. అందుకని నన్ను లోబరచుకుని నాలో నీపట్ల ప్రేమ భావనను కలిగించావు. నాలో నిద్రాణస్థితిలో ఉన్న ప్రేమభావనను రగిలించావు. నీకు మృతసంజీవని విద్య లభించగానే 'సోదరి' అని నీతులు చెప్తున్నావు. ధర్మపన్నాలు వల్లె వేస్తున్నావు. అంతేనా? నమ్మకద్రోహివి నువ్వు'

కచుడు ఏదో అనబోయాడు. అంతలో దేవయాని మళ్లీ అంది.

'మీ పురుషులు ఇంతే. మీ మనసులో ఉన్న అసలు ఉద్దేశాన్ని పైకి తీయటి మాటలలో కప్పిపుచ్చుతారు. అమాయక యువతులు, మీ అమాయకమైన ముఖాలను, అందమైన మాటలను, నిజమని నమ్ముతారు. కానీ పైకి కనబడే అందమైన ముఖం ఓ ముసుగు మాత్రమే అని దాని వెనుక రాక్షసుడు దాగున్నాడని గ్రహించలేరు. మీపని తీరిన తరువాత మీ అసలు రూపం తెలుస్తుంది. అప్పటికే ఆలస్యం అవుతుంది. ఆ నవ్వూ అంతేగా? అటు తండ్రి దగ్గర వినయం నటించావు. ఇటు నా దగ్గర ప్రేమ కురిపించావు. అంతా కపటం. నీకు కావలసింది మృత సంజీవని. అందుకోసం నన్ను చంపి వెళ్తున్నావు. ఇతరులను దుఃఖింపజేసి, బాధపెట్టి, మోసం చేసి సంపాదించిన విద్య నీకు సత్ఫలితం ఇస్తుందనుకున్నావా? ఎందుకూ పనికిరాకుండా పోతుంది. విద్యలో ఎంత శక్తి ఉన్నా దాన్ని ఉపయోగించే వాడి వ్యక్తిత్వం దానిపై ప్రభావం చూపిస్తుంది. నీకు తెలియదా ఆ విషయం?' కోపంగా శపిస్తున్నట్టు అంది దేవయాని.

కచుడు నోరు విప్పాడు.

'దేవయానీ..నువ్వు ఒక్క విషయం నిజం చెప్పావు. నేను శుక్రాచార్యులవారి శిష్యరికంకోసం చేరింది మృత సంజీవని విద్య నేర్వటం కోసమే. గురువుల వారికీ విషయం తెలుసు. అందుకే వారు నాకు

ఆ విద్యనుతప్ప అన్ని విద్యలనూ నేర్పుతూ వచ్చారు. కానీ అసురుల అసూయ, నీతో నాకు ఉన్న సాన్నిహిత్యం వారిలో కలిగించిన క్రోధం వల్ల యాధృచ్ఛికంగా నా కోరిక ఫలించింది. నా లక్ష్యం నెరవేరింది. ఇందులో నేను ప్రదర్శించిన కాపట్యం కానీ, చేసిన వంచన కానీ ఏమీలేదు. నేను నిన్ను ఆరంభం నుంచీ నా సోదరిగానే చూశాను. ఏరోజూ అనుచితంగా ప్రవర్తించలేదు. ఒక్కమాట కూడా అనుచితంగా మాట్లాడలేదు. మన మధ్య ఏనాడూ స్త్రీ, పురుషుల నడుమ ఉండేటటువంటి భావనలున్నాయన్నట్టు నేనేనాడూ ప్రవర్తించలేదు. గురువు తండ్రిలాంటివాడన్నది ధర్మం. నా ధర్మం నాకు తెలుసు. గురుపత్ని తల్లి అనీ, గురు పుత్రిక సోదరి అనీ నాకు తెలుసు. అది నా ధర్మం. ధర్మచ్యుతి కావించినవాడు రాక్షసుడనీ తెలుసు. కాబట్టి ఈనాడు నువ్విలా ఆరోపణలు చేయటం సమంజసం కాదు. నేను మృత సంజీవని విద్యను నేర్చుకోవటానికి వచ్చానన్నది గురువుగారికి తెలుసు. ఆయన నాకా విద్యను తప్పనిసరి పరిస్థితులలో నేర్పారు. లేకపోతే నా విద్యాభ్యాసం కొనసాగుతూనే ఉండేది' స్థిరంగా పలికాడు కచుడు.

అతడి మాటలు దేవయానికి మరింత కోపం కలిగించాయి.

'ధర్మపన్నాలు చెప్తున్నావు. నాతో సన్నిహితంగా ఉన్నపుడు నీలో ఎప్పుడూ వికార భావన కలుగలేదా?' సూటిగా అడిగింది.

తలవంచుకుని లో గొంతుకలో చెప్పాడు కచుడు.

'దేవయానీ..మనిషి మనసులో బోలెడన్ని ఆలోచనలు అనుక్షణం అలల్లా వస్తూంటాయి, పోతూంటాయి. ఆలోచనలను నియంత్రించ గలగటం, వాటిని స్తంభింపచేయగలగటం ఒక యోగం. అదొక విద్య. దానికి సాధన అవసరం. కాబట్టి మంచి ఆలోచనలు వస్తాయి, చెడు ఆలోచనలు వస్తాయి. ఏ ఆలోచనలు వస్తాయన్న దానిపై మనకు నియంత్రణ లేదు కానీ ఏ ఆలోచనను ఆచరణలో పెట్టాలన్న విచక్షణ అవసరం'.

'అంటే నీకా విచక్షణ ఉంది. నాకు లేదనా నీ ఉద్దేశం' కోపంగా అది దేవయాని.

'దేవయానీ, యవ్వనంలో ఉన్న యువతీయువకులు సన్నిహితంగా ఉంటే వారిలో వికార భావనలు కలిగించటం స్వాభావికం. అందుకే ఒక వయసు వచ్చిన తరువాత తండ్రి కూతురిని కూడా తాకరా దంటుంది శాస్త్రం. నువ్వు, నేను యువతీ యువకులం. మనం ప్రత్యేకం ఏమీ కాదు. మామూలు మనుషులం. నేను బృహస్పతి సంతానాన్నయినంత మాత్రాన నేను యువకుడిని కాకపోలేదు. శుక్రాచార్యుడి కూతురివైనంత మాత్రాన నువ్వు యువతివి కాకపోలేదు. కానీ మనకు తల్లిదండ్రులిచ్చిన సంస్కారం, వారినుంచి సంక్రమించిన ధర్మం మన ఆలోచనలపై నియంత్రణను కలిగిస్తాయి. వాటిల్లో మంచీచెడులను నిర్ణయించి స్వీకరించే విచక్షణనిస్తాయి'.

'అంటే..నాకు విచక్షణ లేదు..నియంత్రణ లేదా?' అరిచింది దేవయాని.

ఆమె మాటలను పట్టించుకోకుండా కొనసాగించాడు కచుడు.

'నియమాన్ని పాటించేవారు దేవతలు. ధర్మాన్ని పాలించి, పాటించి, నిలిపేవారు దేవతలు. నేను దేవతల పక్షం. ధర్మాన్ని అతిక్రమించేవారు రాక్షసులు.

నువ్వు రాక్షస గురు పుత్రికవు. అందుకనే నీవు సహజంగా యువతీయువకుల నడుమ సాన్నిహిత్యం ఉంటే కలిగే వికార భావనలను స్వీకరించావు. ఆకర్షణను ప్రేమ అనుకున్నావు. ఉద్రేకాన్ని అనురాగం అనుకున్నావు. ఉత్తేజాన్ని అనుబంధం అనుకున్నావు. కానీ సాధారణంగా కలిగే ప్రచోదనల పైపై పొరలు తీసి లోతుల్లోకి చూసే విచక్షణ ప్రదర్శించలేదు. మనలో మనకు ఎన్ని భావనలు కలిగినా ధర్మమైన భావనలు స్వీకరించాలి. అధర్మ భావనను అణచిపెట్టాలి. నేను చేసింది అదే. నీపట్ల నాకు ఆకర్షణ కలగలేదని కాదు. కానీ నువ్వు సోదరి సమానవని తెలుసు. అందుకే ఆకర్షణను గౌరవంగా మార్చాను. అందుకే నీపట్ల నాకు సోదరి భావన తప్ప మరో భావన లేదు. అందుకే నువ్వు మన్మథుడి ప్రభావం వల్ల ప్రేమించాను కాబట్టి మన వివాహం అయిపోయింది, శుక్రుడి దయతో సంజీవని విద్యతో పాటు నిన్ను పరిగ్రహించమంటే నేను విషాదాంతరంగుడనయ్యాను. లోకనింద్యమగు అర్థం నీ వాక్కులో కనిపిస్తోంది. ఇది ఉచితం కాదని అన్నాను. నా హృదయంలో నీవు నాకు సహోదరివి అని స్పష్టం చేశాను. మన్మథ ప్రభావం వల్ల కలిగిన వికారాన్ని ప్రేమగా భ్రమపడటం అజ్ఞానులైన సామాన్య మానవులకు చెల్లుతుంది. కానీ శుక్రాచార్య పుత్రికవైన నీకు చెల్లదు సోదరీ' అన్నాడు కచుడు.

దేవయాన్ని కోపాన్ని ఆపుకోలేకపోయింది. శోకాన్ని ఆపుకోలేక పోయింది.

'మనసులోని కోరికను మనసులో దాచుకున్నంత కాలమే మనుషులు శక్తిమంతులు. మనసులోని కోరిక పెదిమలపైకి వస్తూనే బలహీనులవుతారు. నువ్వు నీ కోరికను హృదయంలోనే దాచుకున్నావు. కాబట్టి ధర్మపన్నాలు వల్లిస్తున్నావు. నేను నా కోరిక బహిరంగం చేశాను. అందుకని నేరస్తురాలినై నీ ధర్మపన్నాలు వింటున్నాను. అంటే పట్టుబడ్డవారే దొంగలు' అంది ఓవైపు నిప్పు కణాలు, మరోవైపు బాష్ప కణాలు కురిపిస్తూ.

కచుడు తల పంకించాడు.

'దేవయానీ...సన్నిహితంగా ఉన్న ప్రతివారూ ప్రేమికులు కారు. ప్రపంచంలో స్త్రీ, పురుషులది ఒక్కటే ప్రేమ కాదు. ప్రేమ అనంతమైన భావన. దాన్ని స్త్రీ, పురుషులకు మాత్రమే పరిమితం చేసి సంకుచితం చేయకు. నాది ధర్మంపైన ప్రేమ. సత్యంపైన ప్రేమ. నాధర్మం నా ఆలోచనలలోని ఉచితానుచితాలను గ్రహించే విచక్షణను నాకు నేర్పింది. నేను కేవలం ఈ క్షణం కోసం, క్షణికానందం కోసం, క్షణిక భావనల కోసం బతికే మనిషిని కాదు. నాకు నిన్న ఉంది. నేడు ఉంది. నేటి నా చర్యల ప్రభావం రేపటిపై ఉంటుందన్న గ్రహింపు ఉంది. అందుకని నేను క్షణికావేశాలకు, క్షణిక ఆకర్షణలకు లోనుకాను. అందుకే నాడు, నేడు, రేపుకూడా నువ్వు నాకు సోదరివే. ఆ భావన తప్ప, నాకు నీపట్ల మరో భావన కలగదు. 'సెలవు' అన్నాడు కచుడు.

అతడు తనని అవమానించి వెళ్లిపోతున్నాడన్న భావన దేవయానిలో క్రోధాన్ని కలిగించింది. అతడి మాటలలోని సత్యం ఆమెలోని నేరభావనను తట్టిలేపింది. అది ఆమె క్రోధాగ్నిలో ఆజ్యంపోసింది. తోక తొక్కిన తాచులా ఆమె లేచింది.

' నీ విద్య నీకు పనికిరాదు. నువ్వింత కష్టపడి మోసం చేసి, ద్రోహం చేసి సాధించిన విద్య నీకు ఎందుకూ పనికిరాదు'.

'నేను ధర్మం కోసం ఈ విద్యను నేర్చుకున్నాను. ధర్మాన్ని నిలపటం కోసం నేర్చిన విద్య ఎన్నడూ వ్యర్థంకాదు. కానీ నువ్వు ధర్మాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తున్నావు. అనుచితమైన, ఆవేశాన్ని ప్రదర్శిస్తున్నావు. అధర్మం బాటలో ప్రయాణించాలని ప్రయత్నిస్తున్నావు. నువ్వు ధర్మం తప్పిన బాటలోనే ప్రయాణిస్తావు' అన్నాడు. వేగంగా వెళ్లిపోయాడు.

అతడు వెళ్లిన వైపే చూస్తూ నిలబడింది దేవయాని.


కచుడి మాటలు ఆమె మనసులో సందేహాన్ని కలుగచేశాయి. తాను తన సహజమైన అహంకారంతో, గారాబం వల్ల, మొండితనం వల్ల కచుడి ప్రవర్తనను తప్పుగా అర్థం చేసుకుందా?

ఆకర్షణను ప్రేమ అని భ్రమపడిందా?

****

కచుడు మృత సంజీవని విద్యను ఇతరులకు నేర్పాడు. వారిలో ఆ విద్య ఫలించింది. కచుడి వాక్కుననుసరించి దేవయాని బ్రాహ్మణ యువతి అయి ఉండి రాజు యయాతిని వివాహం చేసుకోవటం సంభవించింది.

పరిణతి లేని యువతీయువకులు సన్నిహితంగా ఉండటం వల్ల కలిగే వికృత పరిణామాలకు హెచ్చరికగా మహాభారతంలోని కచ దేవయానిల కథ నిలుస్తుంది.



తేడాలు గుర్తిస్తారా

పిల్లలూ! ఈ 2 బొమ్మల మధ్య ఉన్న తేడాలు గుర్తిస్తారా!

పదాన్వేషణ-23

నిర్వహణ
గుల్ మహమ్మద్ నాయక్

1	2	3	4	5	6
R,A	B,E	C,L	S,W	M,N	D,P

పిల్లలూ! కింది ఆధారాలకు ఎదురుగా ఉన్న అంకెలను చూడండి. ఆ అంకెలతో సంబంధం ఉన్న పై గళ్లలోని రెండు అక్షరాలతో ఆధారానికి తగిన జవాబును రెండు ఆంగ్ల పదాలతో రాయండి.

ఉదా:ఆధారం: డబ్బులు పెట్టుకునే చిన్న సంచి-5,6

అంటే 5వ గడిలోంచి ఒక అక్షరం, 6వ గడిలోంచి ఒక అక్షరం తీసుకుని జవాబు రాయాలి.

జవాబు: 5వ గడిలోంచి 'M', 6వ గడిలోంచి 'P' తీసుకుని 'MONEY PURSE' అని జవాబు రాయాలి.

ఆధారాలు:

1. రక్త సంబంధ బాంధవ్యము -2,1.........
2. సచిన్ టెండూల్కర్‌ను ఇలా కూడా పిలుస్తారు. - 3, 5 ......
3. స్థానిక సంస్థ -3, 2 ....
4. చౌకధర దుకాణము - 1, 4 ....
5. చిన్నపిల్లలు ఈ ఆంగ్ల సినిమాను ఇష్టపడ్తారు. - 4, 5 .....

తేడాలు గుర్తిస్తారా జవాబు

1. చెట్లకు నీళ్లుపోసే కెటిల్ లేదు. 2. కుడివైపు చెట్టుపక్కన తేడా 3. ఎడమవైపు చెట్టు పక్కన తేడా 4. మబ్బుల్లో తేడా 5. చెట్లపైన గీతల డిజైన్ లేదు.

పొరపాటు

కథ

నల్లమల అడవిలో ఒక ఎలుగుబంటి నివసించేది. అది బలిష్టంగా ఉండి తనకంటే చిన్న జంతువులను భయపెడ్తూ ఉండేది. ఒకరోజు అది ఉన్న ప్రదేశానికి పెద్దపులి వచ్చింది. పెద్దగా గాండ్రించింది.

ఎలుగుబంటి భయపడి పోయి పరుగులంకించుకుంది. కాలి బలం కొద్దీ పరుగెత్తి అడవి బయటకు వచ్చేసింది. పక్కనున్న గ్రామ పొలిమేరలలోకి వచ్చింది.

అక్కడ పిల్లలు పులి ఆట ఆడుకుంటున్నారు. ఇద్దరు పిల్లలు పులివేషం వేసుకుని మిగతా పిల్లలతో ఆడుతున్నారు. అసలే పెద్ద పులిదెబ్బకు భయంతో ఉన్న ఎలుగుబంటి పులి వేషధారులను చూసి వణికిపోయి ప్రాణరక్షణ కోసం పరుగెత్తి ఓపికలేక చకచక కనిపించిన చెట్టు ఎక్కేసింది.

భయంతో చెట్టుమీదనే రాత్రి దాకా ఉండిపోయింది. పిల్లలు ఆటలు చాలించి వెళ్లిపోయిన తరువాత దానికి ధైర్యం వచ్చింది. చుట్టుతా చూసింది. తాటిచెట్ల తోట అది. తను ఎక్కింది కూడా తాటిచెట్టే. నిటారుగా చాలా ఎత్తులో ఉంది. అటుయిటు చూసిన ఎలుగుబంటికి ఆ తాటిచెట్టుకు ఒక కుండ కట్టి ఉండటం కనిపించింది.

కుతూహలం కొద్దీ కుండలోపలికి చూసింది. ఒక రకమైన ద్రవం కనిపించింది. దాహం తీర్చుకుందామని లటలట ఆ ద్రవాన్ని తాగేసింది. అది చాలా రుచిగా ఉన్నట్లనిపించింది. తాగగానే వంటిలో మంచి ఉత్సాహం వచ్చినట్లయింది. కొంచెం నిద్రతూగు కూడా వచ్చింది. చకచక చెట్టు దిగి దగ్గరలోని ఓ అరుగుకింద విశ్రమించింది.

అప్పట్నుంచి ఆ ఎలుగుబంటి ఆ చుట్టుపక్కల తిరగసాగింది. తాటిచెట్లు ఎక్కడం అక్కడ కట్టి ఉన్న కుండల్లోని కల్లు తాగడం ప్రారంభించింది. తాటికల్లు తీసేవాళ్లు కల్లుకుండలు ఖాళీ అవుతుండటంతో తమ వ్యాపారం నష్టపోసాగారు. తమకు నష్టం కలిగిస్తున్నది



ఎవరో తెలుసుకోవాలని రాత్రుళ్లు కాపలా కాశారు. కొన్ని రోజులకు వారి కంటికి కల్లు తాగుతున్న ఎలుగుబంటి కనిపించింది.

ఇంకేముంది అక్కడికి ఎలుగుబంటి రాకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. కాపలా పెట్టేవాళ్లు అది వస్తూంటే కర్రలతో అదలించేవాళ్లు. కుక్కల్ని ఉసిగొల్పేవాళ్లు.

ఇన్నిచేసినా కల్లు మరిగిన ఎలుగుబంటి ఏ అర్ధరాత్రో వాళ్ల కన్నుగప్పి వచ్చి చెట్టు ఎక్కి కల్లు తాగి పారిపోయేది.

భీమయ్య అనే కల్లుగీతగాడు ఎలుగుబంటిని పట్టుకోవాలని ఒక చెట్టుకింద వలపన్ని దూరంగా కూర్చున్నాడు. దొంగ చాటుగా వచ్చి ఎలుగుబంటి





వార్త ఆదివారం

ఆ వలలో చిక్కుకుపోయింది. ఎంత గుంజుకున్నా బయటపడలేకపోయింది. భీమయ్య తన మనుషులను పిలిపించి ఎలుగుబంటిని బంధించాడు. అది భీకరంగా ఎదిరించింది. కానీ మంది బలం ముందు దాని బలం సరిపోలేదు. భీమయ్య దాన్ని అడవుల్లో వదిలిపెడదామనుకున్నాడు కానీ అది మళ్లీ ఇక్కడికే రావచ్చని అనుమానం కలిగింది.

పట్టణంలో జంతువుల సర్కస్ ఆడుతున్నది. భీమయ్య పోయి ఆ సర్కస్ యజమానికి ఎలుగుబంటి గురించి చెప్పాడు.

అతను ఆనందంగా తన జంతు శిక్షకుడిని తీసుకుని అక్కడకు చేరుకున్నాడు.

మత్తుమందు ఇచ్చి ఎలుగు బంటిని తన పంజరంలో బంధించి తీసుకుపోయాడు. అక్కడ దానికి కొన్ని ఆటలు నేర్పించాడు. రోజూ ప్రేక్షకులముందు ఆ ఆటలు ఆడించి సొమ్ముచేసుకునేవాడు.

బాగా ఆటలు ఆడి అలసిన ఎలుగుబంటికి గతం గుర్తుకొచ్చి బాధ కలిగింది. కల్లుకు అలవాటుపడి తను తన స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకున్నట్లు గ్రహించి పశ్చాత్తాప పడింది. కానీ అప్పటికే ఒక జీవిత కాలం ఆలస్యం అయిపోయింది. దాని బతుకు పంజరంలోనే తెల్లవారిపోయింది.

–వియోగి

పదాన్వేషణ 23 జవాబులు

1. BLOOD RELATION
2.LITTLE MASTER
3.LOCAL BODY
4.RATION SHOP
5.SPIDER MAN

హలో ఫ్రెండ్...



చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

పి.కృష్ణ మనోహర్, నల్గొండ.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఏడో తరగతి చదువుతున్నాను. వ్యర్థాలతో మనదేశంలో ఏయే వస్తువులను తయారుచేస్తున్నారు? దయచేసి వివరించండి.

జవాబు: కృష్ణ మనోహర్! మనదేశంలో సైతం వ్యర్థ ప్లాసిక్ వస్తువులను రీసైక్లింగ్ చేసి, దానితో ఎన్నో వినియోగ వస్తువులను తయారుచేస్తున్నారు. అమెరికా సాంకేతిక పరిజ్ఞానంతో హైదరాబాద్ సమీపాన ఉన్న షాద్‌నగర్ ప్రాంతంలో చెత్తను దహనం చేసి విద్యుత్తును ఉత్పత్తిచేస్తున్నారు. మైసూరులో జీవసంబంధమైన వ్యర్థ పదార్థాల నుండి సేంద్రీయ ఎరువులను తయారుచేస్తున్నారు. ప్లాట్‌ఫాం మీద చెత్తను పోసి మైక్రోబ్స్ అనే సూక్ష్మజీవులను వినియోగించి ఏరోబికల్‌గా జీవవిచ్ఛితి చేస్తున్నారు. దీన్ని రిచ్ ఆర్గానిక్ పేరుతో మార్కెట్ చేస్తున్నారు. ఢిల్లీలో కూడా చెత్తనుండి కంపోస్ట్ ఎరువును తయారుచేసి, ఎన్‌రిచ్ కంపోస్ట్ పేరుతో మార్కెట్ చేస్తున్నారు. పుణేలో చెరకుపంటలో వ్యర్థపదార్థమైన చెరకు ఆకులనుండి ఇందనపు ఇటుకలను తయారు చేస్తున్నారు. ఇవి ప్రజలకు వంటచెరకుగా ఉపయోగపడుతున్నాయి. ఫలితంగా వంటచెరకు కోసం చెట్లను నరకడం కొంతవరకు తగ్గుతుంది. అలాగే చెరకు పిప్పితో పేపర్, కార్డ్‌బోర్డులను తయారుచేస్తున్నారు. అంతేకాకుండా హర్యానాలోని పానిపట్‌లో చక్కెర మిల్లునుంచి విడుదలయ్యే చెరకు పిప్పిని ఉపయోగించి విద్యుచ్ఛక్తిని తయారుచేసే ప్లాంటును నెలకొల్పారు. అదే విధంగా మనరాష్ట్రంలోని పాల్వంచలో చెరకుపిప్పిని ఇంధనంగా ఉపయోగించి విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిచేసే యూనిట్‌ను నెలకొల్పారు. అలాగే ఫ్లై యాష్ అంటే థర్మల్ విద్యుత్ కేంద్రాలనుండి విడుదలయ్యే బూడిదను ఉపయోగించి నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో ఇటుకలు, హాలోబ్రిక్స్, టైల్స్, ప్యానెల్స్ తయారుచేస్తున్నారు. అలాగే వరిపొట్టు నుంచి విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిచేసే విద్యుత్ ప్లాంటు పంజాబ్‌లో ఉంది. ఇలా ఎన్నెన్నో.

డి.సాయి ప్రదీప, గుంటూరు.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఆరో తరగతి చదువుతున్నాను. ఒక చెట్టు దాని జీవితకాలంలో ఎంత కార్బన్‌డై ఆక్సైడ్‌ను పీల్చుకుంటుంది. దయచేసి చెప్పండి.

జవాబు: సాయిప్రదీపా! ఒక చెట్టు దాని జీవితకాలంలో సగటున టన్ను కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకొని పర్యావరణాన్ని కాలుష్యం నుంచి కాపాడుతుంది.



సాహిత్యం...సంస్కారం

హితంతో కూడినది సాహిత్యం. సంస్కారం అంటే చక్క బరచడం. రానురాను పదాలు తమ సహజార్థాలను వ్యుత్పత్తి అర్థాలను కోల్పోయి వ్యవహారార్థంలో మిగిలిపోతున్నాయి.

ఘరానా అనగా వంశగౌరవం, సంప్రదాయం. ఈ పదానికి ఘన అనే అర్థమిచ్చి అతడో ఘరానా మోసగాడు', కట్నకానుకలు ఘరానాగానే యిచ్చారు..అని వ్యవహరిస్తున్నారు.

కొదమసింహం అంటే సింహపు పిల్ల. కానీ ఇది వ్యవహారార్థంలో రౌద్రంగా ఉన్న సింహం అనే అర్థాన్ని సంతరించుకుంది.

కిశోరం అంటే పిల్ల, బిడ్డ. కానీ కిశోరం అనే పదం ప్రస్తుతం సింహం అనే పదానికి పర్యాయపదమైపోయింది. యువకిశోరం, నటకిశోరం..అనే ప్రయోగాలు వినిపిస్తున్నాయి. బుజ్జగించడం, సముదాయించడం, చలాయించడం, జమాయించడం..ఇవన్నీ అన్య భాషలనుండి స్వీకరించగా, తెలుగుదనం అద్దుకున్న పదాలు. మూలభాషలోని అర్థాలను పూర్తిగా మరచిపోయాం.

అలాగే సాహిత్యం అన్న పదం తన వ్యుత్పత్తి అర్థాన్ని కోల్పోయి ఆంగ్ల భాషా పదమైన లిటరేచర్ అన్న పదానికి పర్యాయ పదంగా వాడుకలో ఉంది. పద్యసాహిత్యం, గద్య సాహిత్యం, నవలా సాహిత్యం, అవధాన సాహిత్యం, విప్లవ సాహిత్యం, క్షుద్ర సాహిత్యం, గేయ సాహిత్యం.. ఇలా వీటన్నిటిలో హితం అనేది ఎంత ఉందోగానీ అన్నీ సాహిత్య ప్రక్రియలుగానే పరిగణింపబడు తున్నాయి. అలాగే సంస్కారం అన్న పదం కూడా తన సహజార్థాన్ని వదిలేసుకుని కల్చర్ అనే ఆంగ్ల పదానికి సమానార్థకమైంది. గ్రంథస్థమైన ఏ విషయమైనా పాఠకులను ఆకట్టుకుని ఆదర్శప్రాయంగా నిలవాలని విజ్ఞుల అభిప్రాయం. అందుకే గ్రంథాలను సమాజానికి దిక్సూచిగా అభివర్ణిస్తారు. పురాణ సాహిత్యమంటే దాదాపు గద్య పద్యాత్మకం గానే ఉంది. పద్యాలకు ఛందస్సు అనే ఒక కొలమానం ఉంటుంది. ఉదాహరణకు క్లుప్తంగా, అందంగా వర్ణించడానికి కందపద్యం, క్రమాలంకారానికి సీసపద్యం. భగవన్నివేదనకు దండకం... ఈ దండకం అనే ఛందోప్రక్రియ రెండు గురువులు ఒక లఘువుతో త గణాలుగా సాగి, చివర్లో నమస్తే, నమస్తే, నమస్తే నమః అని ముగుస్తుంది.

కాళిదాసు కాళీ స్తోత్రంగా శ్యామలా దండకం రచించగా, పోతన తొలినాళ్లలో భోగకాంత వర్ణనగా భోగినీ దండకం రాశాడు. ఆపై భాగవత రచనచేశాడు.

శృంగార కవిగా పేరుగాంచిన శ్రీనాథుడు తన కావ్యంలో ఈశ్వరుడు పణ్యస్త్రీల వెంటపడ్డాడని రాయగా..సాని కూతుల తగుల మీశానునకు పలికితివి..అని మందలించాడు ఓ కవి.

ఇందుగలడందులేడని.. భగవానుని సర్వాంతర్యామిత్వాన్ని తెలియజేసిన కందమనే ఛందస్సులోనే కవి చౌడప్ప శతకంగా వికృతమైన పద్యాలు కూడా వెలిశాయి.

సాహితీవనం

కవిత్రయ భారతం, కవిత్రయ భాగవతం, ఇంకా ఎన్నో పవిత్ర గ్రంథాలు వెలయించిన మసజసతతగ, సభరనమయవల్లోనే రాధికా సాంత్వనము, చంద్రలేఖా విలాపము వెలువడ్డాయి.

అంతెందుకూ మంత్రాలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి కాబట్టి అందరూ బుర్రలూపుతున్నారుగానీ అర్థం తెలిస్తే బుగ్గలు నొక్కుకోవలసిందే.

ప్రస్తుతం సినిమా సాహిత్యం అందరికీ సలుభగ్రాహ్యమై అందు బాటులో ఉండడం వల్ల విస్తృతంగా ప్రేక్షకాదరణ పొందుతోంది. అందుకే విమర్శకుల దృష్టి ఇప్పుడు సినిమా సాహిత్యం పైకి మళ్లింది. ఇటీవల విడుదలైన దువ్వాడ జగన్నాథం' చిత్రంలోని ఒక పాటపై విమర్శకులు విరుచుకుపడిన తీరు యిందుకు ఉదాహరణ.

నమకం, చమకం, అగ్రహారాల తమలపాకు, ప్రవరలో ప్రణవమంత్రం..ఈపదాలు ముఖ్యంగా విమర్శకు గురయ్యాయి.


నమకం, చమకం అనే శ్రీరుద్రంలోని పదాలు ప్రేమసీమలో ఎలా వాడారన్నది ఒక విమర్శ.ప్రేయసీ నీ పాదాలపై పూలు వేసి పూజిస్తాను..అంటే పూలు భగవంతునిపై వెయ్యాలిగానీ ప్రేయసి పాదాలమీద ఎలా వేస్తారు అని అనేవారూ అనవచ్చు. నమకం, చమకం చాలా పవిత్రమైన పదాలు అంటున్నారేగానీ వాటి అర్థం ఏమిటో చెప్పడంలేదు. అవి పూర్తిగా ఇహలోక సంపదలను అనుగ్రహించమని రుద్రుణ్ణి ప్రార్థించడమే. నమో అన్న పదంలోంచి నమకం, చమే (నాకు కూడా) అనే పదంలోంచి చమకం పుట్టాయి.

ప్రవర అన్నది ఒక వంశంలోని ఋషి పరంపర. ఏ గోత్రంలో జన్మించిన వారు ఆ గోత్రంలోని ఆద్యులైన ఋషులు ఎవరున్నారని చెప్పడం. తన పేరు తాను చెప్పుకోవడం అహంకారం..పెద్దల పేరుతోకూడా కలిపి చెపితే వినయమూ! ప్రవరలో ప్రణయమంత్రమే లేకపోతే ఋషి పరంపర యింతవరకూ కొనసాగేదికాదు.

తమలపాకు అంటే..ఏదో అట. ఒక విమర్శకుడి అభిప్రాయం. ఆమాటకొస్తే నిత్యశివపూజా దురంధరులు గావించే లింగార్చన మాటేమిటి? బూతద్దంలోంచి చూస్తే ప్రతిమాటకూ బూతు అర్థమే కనిపిస్తుంది. అర్థరహితమైన (పైసా ఖర్చులేని) విమర్శలు చేసే ముందు సహేతుకతను ఒకసారి ఆలోచించటం మంచిది.

–డా.జంధ్యాల సుబ్బలక్ష్మి





కుటుంబమంతా జంతుసేవలో..

పిల్లలు ముచ్చటపడితే ఏ కుక్కనో, కుందేలునో, చిలుకనో పెంచుకోవడం మనకు తెలుసు. కానీ డీన్ ట్వీడీ అనే ఆయన ఏకంగా ఒక 'జూ'నే కొనేశాడు. కెంట్ ప్రాంతంలో చిన్నపాటి 'జూ' కొనాలన్న ఆలోచనతో వాకబు చేశారు. చివరకు వేల్స్ ప్రాంతంలో 300 వన్యప్రాణులతో కూడిన పెద్ద 'జూ'నే కొనే అవకాశం లభించింది. అందులో సింహాలు, కోతులు, చిరుతలు, మీర్కాట్స్, నెమళ్లు, తాబేళ్లు, మొసళ్లు, చెవుల పిల్లులు వగైరాలెన్నో ఉన్నాయి. అందులో సర్ప గృహం కూడా ఉంది. అందులో మధ్యస్థ పరిమాణంలో ఉన్న అంటే 15 అడుగుల పాము, 22 అడుగుల ఆడ బోవా కన్‌స్ట్రిక్టర్ కూడా ఉన్నాయి. డీన్ ట్వీడీ భార్య ట్రేసీ సైకో థెరపిస్ట్. తన వైద్యంలో భాగంగా ఇప్పుడు వన్యప్రాణుల థెరపీని కూడా చేరుస్తోంది. ఈ 'జూ'ను 625,000 పౌండ్లకు కొనుగోలు చేశాక డీన్ ట్వీడీ కుటుంబం కెంట్‌లోని మిల్టన్ రెగిస్ నుంచి మిడ్ వేల్స్‌కు తరలివచ్చింది. అంతకుముందే వారి





దగ్గర 40 పెంపుడు జంతువులు ఉన్నాయి. ఇవి కాక గుర్రపు పిల్లలు, మేకలు, ఆవులు, గొర్రెలు, పందులు, కుందేళ్లు, గినియా పందులు కూడా ఉన్నాయి.

డీన్ కుమార్తెలు సోఫీ (13), సారా (9), పూగె (8) లకు వేసవి సెలవుల్లో వీటితోనే కాలక్షేపం. ఉదయం లేచింది మొదలు ఆ ముగ్గురూ జూ కీపర్లకు సహాయపడుతుంటారు. వీరి స్నేహితులు కూడా వన్యప్రాణుల సేవకు అమితాసక్తి చూపుతున్నారట. మీర్కాట్ ఎన్‌క్లోజర్‌కు పెయింట్ వేయడమే తదుపరి పని అని అంటున్నాడు ట్వీడీ.

స్థానిక మనుషుల్ని కూడా జూ పనులలో భాగస్వాముల్ని చేయాలనుకుంటున్నాడు. ఇక్కడ ఉన్న వన్యప్రాణులలో చాలా వరకు ఇతర 'జూ'లనుంచి తెచ్చినవి లేదా ఇతర యజమానులు వీరికి ఇచ్చినవి. చిరుత నిజానికి ఓ భారతీయ యువరాజుకు చెందిందట. కానీ అది ఓసారి యజమానిపైనే దాడిచేయబోవటంతో దాన్ని జూకు ఇచ్చేశారట. జంతువులకు రక్షణతో పాటు, మనుషులకు కూడా ఆశ్రయం ఇవ్వాలన్నది తన ఆలోచన అంటాడు ట్వీడీ.

జోక్స్ కార్నర్

తల్లి: ఏరా చింటూ! డబ్బాలో నాలుగు మిఠాయిలు ఉండాలి. ఇప్పుడు ఒక్కటే ఉందేమిటి?

చింటు: అరెరె..ఇంకొకటి ఉందా? నేనే చూసుకోలా...

రవి: ఈ షాంపూపై ఏమైనా ఫ్రీ ఉందా?

షాపు ఓనర్: లేదండీ.

రవి: అదేంటి అబద్ధం చెపుతారు? ఇక్కడ డాండ్రఫ్ ఫ్రీ అని ఉందిగా?

భార్య: ఏమండీ..ఇది విన్నారా?

భర్త: ఏదీ నువ్వు చెప్పందే..

భార్య: మరి మనకు పెళ్లి చేసిన అయ్యవారు బస్సు ఢీకొట్టి పోయాడట.

భర్త: మరే..చేసిన పాపం ఊరికే పోతుందా!

జైలర్: నీకు ఈరోజు ఉరిశిక్ష వేస్తాం. నీ చివరి కోరిక ఏంటో చెప్పు.

ఖైదీ: అయితే నన్ను తలకిందులుగా ఉరి తీయండి సార్.

భర్త: ఇడ్లీలో ఉప్పు ఎక్కువయింది.

భార్య: అయితే ఏంటట. చట్నీలో ఉప్పు వేయలేదు. రెండూ కలిపి తినేస్తే సరి.

కిట్టు: నాన్నా! కాకులు అరిస్తే చుట్టాలు వస్తారటకదా. మరి ఆ చుట్టాలు వెళ్లిపోవాలంటే?

నాన్న: ఏముంది..మీ అమ్మ అరిస్తే చాలు.

పేషెంట్: ఏంటో డాక్టర్..ఏమందూ వేసుకోకపోయినా ఒళ్లంతా మత్తుగా ఉంటోంది.

డాక్టర్: అలాగా..బిల్లు ఇస్తానుండండి. మత్తు దెబ్బకు దిగిపోతుంది.

రాధ: బామ్మా! నీకు దేవుడు ప్రత్యక్షమయి వరంకోరుకోమంటే ఏం వరం కోరుకుంటావ్?

బామ్మ: ఈ వయసులో నాకేం కోరిక లుంటాయే.. మహా అంటే స్వర్గం సీరియల్ అయ్యేదాకా ఆయుష్షు ఇవ్వమంటా.



"ఒక్కసారి ఆఫీసుకు వస్తారా, మీతో మాట్లాడాలి" సెల్ ఫోన్‌లోని స్వరం. ఇదివరకు నేను పని చేసి రిటైర్ అయిన హెచ్.ఆర్. మేనేజర్ సూర్యప్రకాశ్‌ది.

"ఏ రోజు రమ్మంటారు?" అడిగాను రిటైర్ అయి రెండేళ్లు కావొస్తోంది కదా, నాతో ఏం పని పడిందా? అని ఆలోచిస్తూనే.

"రేపు ఉదయం పది గంటలకు రండి" సూర్యప్రకాష్.

"అలాగే" అంటూ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసాను.

"రండి మూర్తిగారూ!" అంటూ తన ఛాంబర్‌లోకి సాదరంగా ఆహ్వానించాడు సూర్యప్రకాష్.

"మిమ్మల్ని రమ్మన్న విషయమేమంటే కొన్నాళ్లు శేషగిరి సీట్లో మీరు పని చేయవలసి ఉంటుంది. శేషగిరి సస్పెన్షన్‌లో పెట్టబడ్డాడు. అతనిపై ఎంక్వైరీ ఆర్డర్ చేసాం. శేషగిరి సీట్లో పని చేయడానికి కొత్తగా ఇంకొకర్ని తీసుకోవాలి. ఆ వ్యక్తికి ట్రైనింగ్ ఇవ్వాలి. ఈ ప్రక్రియకు సుమారు అయిదారు నెలలు పట్టవచ్చు. అంతవరకూ మీరు ఆ పని చూసుకుంటే చాలు. తగిన వేతనం మీకు అందుతుంది" విషయం సూటిగాను, స్పష్టంగానూ చెప్పాడు సూర్యప్రకాష్.

శేషగిరి ఎందుకు సస్పెన్షన్‌లో పెట్టబడ్డాడో మాత్రం వెల్లడి చేయలేదు.

నేను కూడా అడగడానికి కాస్త మొహమాటపడ్డాను.

"మీకేమీ అభ్యంతరం ఉండదనుకుంటాను..." నా సమాధానం వినకుండానే తన సందేహాన్ని బయట పెట్టాడు.

"కానీ శేషగిరి సీట్లో పని నాకు పూర్తిగా కొత్త" నా అనుమానాన్ని సూర్యప్రకాష్ ముందుంచాను.

"మీకు ఈ కంపెనీలోనూ, ఈ డిపార్టు మెంటులోనూ దాదాపు ముప్పై ఏళ్ల అనుభవం ఉంది. మీరు తలచుకుంటే ఇది పెద్ద విషయమేమీ కాదు, ఎందుకంటే మీకు డిపార్టుమెంటులోని అన్ని విభాగాలలో మంచి అవగాహన ఉంది" తన ప్రతిపాదనను సమర్థించుకున్నాడు సూర్యప్రకాష్.

స్వయంకృతం

– వి.వి.కూర్మారావు

"సరే! ఏ విషయమూ రేపు తెలియజేస్తాను. వీలయితే రేపే డ్యూటీలో జాయిన్ అవుతాను" అక్కడి నుండి సెలవు తీసుకున్నాను.

"శేషగిరిని ఎందుకు సస్పెన్షన్‌లో పెట్టారు? కారణమేమిటి? నేపథ్యమేమిటి?" మొదలైన ప్రశ్నలు నా మెదడును తొలుస్తున్నాయి. వీటికి సమాధానాలు రాబట్టాలని నా మనసు తొందర చేస్తోంది. "రేపు ఆ సీట్లోకెళ్లిన తరువాత ఎలాగూ తెలుస్తుంది" సమాధానపరచుకున్నాను. కానీ ఆ కారణం వెంటనే తెలుసుకోవాలన్న కుతూహలం నన్ను వెంటాడుతోంది.

నాతో ఇదివరకు పనిచేసిన స్టాఫ్ దగ్గరికి వెళ్లాను. కులాసా కబుర్లయిన తరువాత నాకు అసిస్టెంట్‌గా పని చేసిన శ్రీనివాస్ దగ్గర శేషగిరి విషయం కదిలించాను. వివరాలు అడిగాను.

"శేషగిరి మొన్న జరిగిన ట్రైనీల రిక్రూట్ మెంటులో మార్కెటింగ్ శాఖకు ఎంపిక కాబడిన ఒక ఎం.బి.ఏ. కాండిడేట్‌ను ఏభై వేలు ఇంటికి తీసుకురమ్మని ఇంటి చిరునామా ఇచ్చాడట. అపాయింట్‌మెంట్ లెటర్ విడుదల చేయడానికి ఆ షరతు పెట్టాడట. చేసేది లేక ఆ కుర్రవాడు ఏభై వేలు శేషగిరి ఇంటికి తీసుకువెళ్లి ఇచ్చాడట. కంపెనీలో జాయిన్ అయిన పిమ్మట ఆ కుర్రవాడు శేషగిరి తనను బ్లాక్ మెయిల్ చేసిన సంగతి ఏభై వేలు డిమాండు చేసిన విషయం.. చెన్నైలో ఉన్న మార్కెటింగ్ శాఖ వైస్ ప్రెసిడెంట్‌కు ఓ లేఖ ద్వారా తెలియపరిచాడట. ఆ లేఖను మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ హెచ్.ఆర్. విభాగాధిపతికి పంపుతూ తగిన చర్య తీసుకోమని కోరాడట. ఫలితంగా, నిన్న ఆఫీసుకు వచ్చిన శేషగిరిని సస్పెన్షన్‌లో పెట్టినట్లు తెలియజేస్తూ ఓ లెటర్ ఇచ్చి, ఆఫీసు తాళాలు తీసుకొని ఇంటికి వెళ్లమని పంపించివేశారట– ఇది నేను తెలుసుకున్న విషయం" జరిగింది పూసగుచ్చినట్లు చెప్పాడు శ్రీనివాస్.



ఒక్కసారిగా షాక్ అయ్యాను. శేషగిరి ఇటువంటి పనికి పూనుకుంటాడని ఊహించడానికి కూడా సాహసించలేకపోయాను. శేషగిరితో నా స్నేహం అటువంటిది. అది కంపెనీలోనిది కాదు. దాదాపు మూడు దశాబ్దాల కిందటిది. నా ఆలోచనలు వెనక్కి మళ్లాయి.

నేనూ, శేషగిరి ఒకే కాలేజిలో బి.కాం. చదివాం. శేషగిరికంటే నేను రెండేళ్లు సీనియర్ని. అయితే శేషగిరి, నేను విశాఖ పట్నంలో ఒకే వీధిలో ఉండడం మూలాన చాలా స్నేహంగా మెలిగాం. డిగ్రీతోనే నా చదువుకు ఫుల్ స్టాప్ పెట్టి ఉద్యోగం వెతుక్కోమన్నారు మా నాన్నగారు. హైదరాబాద్‌లో ఓ పబ్లిక్ సెక్టార్ కంపెనీలో ఉద్యోగం రాగా అందులో చేరాను. కానీ నా మనసంతా విశాఖపట్నంలోనే ఉండేది. మా నాన్నగారు విశాఖపట్నం పోర్ట్‌లో జాబ్ చేస్తూ ఉండేవారు. మా తల్లిదండ్రులకు నేను ఒక్కడినే సంతానం. ఒక్కగానొక్క కొడుకును వదిలి ఉండలేక చాలా మథన పడేవారు. కొన్నాళ్లకు నాకు వివాహం జరిపించారు. భార్య కమలతో హైదరాబాద్‌లో కాపురం పెట్టాను. నా తరువాత డిగ్రీ పూర్తి చేసిన శేషగిరి పి.జి. కూడా చేసి విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ కంపెనీలో చేరినట్లు, హెచ్.ఆర్. విభాగంలో పని చేస్తున్నట్లు చెప్పాడు. ఆ కంపెనీలో కొత్తగా కొన్ని ఖాళీలు ఏర్పడ్డాయని, నన్ను దరఖాస్తు చేయమని చెప్పాడు. నా దరఖాస్తు పరిశీలించిన ఆ కంపెనీ మేనేజిమెంటువారు ఇంటర్వ్యూకు రమ్మన్నారు.

ఇంటర్వ్యూ రోజున శేషగిరిని కలిసాను.

"మూర్తీ, ఇంటర్వ్యూ బాగా చెయ్యి. హెచ్.ఆర్. మేనేజర్ గారికి ఇదివరకే నీ గురించి చెప్పాను. నీకు తప్పకుండా ఇక్కడ అపాయింటుమెంటు దొరుకుతుంది. నువ్వు మళ్లీ విశాఖపట్నం రావొచ్చు. మీ తల్లిదండ్రుల దగ్గరే ఉండి వారి బాగోగులను చూసుకోవచ్చు" శేషగిరి ఎంతో అభిమానంతో చెప్పిన మాటలు నాకు అతనిపై ఉన్న సదభిప్రాయాన్ని రెండింతలు చేసింది.

ఇంటర్వ్యూ బాగా చేసాను. ఆ కంపెనీలో అపాయింటుమెంటు దొరికింది. నేను, శేషగిరి కలిసి ఒకే కంపెనీలోనూ, ఒకే డిపార్ట్‌మెంటులోనూ పని చేసే అవకాశం లభించింది. అలా శేషగిరితో నా స్నేహం మరింత బలపడింది. శేషగిరి తండ్రి రెండేళ్ల క్రితమే మరణించారు. తల్లి అతని వద్దనే ఉంటుంది. ఉన్న ఒకే ఒక్క కుమార్తెకు ఈ మధ్యనే పెళ్లి చేసాడు.

"విచిత్రం కాకపోతే, నన్ను ఇంతగా ఆదుకున్న, ఆదరించిన శేషగిరి సస్పెన్షన్‌లో ఉండటమేమిటి? ఆ పనిని నేను నిర్వహించడమేమిటి, అంతా మాయగా ఉంది"

ఓ రోజు సాయంత్రం ఆఫీసు పని ముగించుకొని- ఓదార్చుదామని శేషగిరి ఇంటికి బయలుదేరాను. ఇంటిముందున్న కాలింగ్ బెల్ నొక్కగా శేషగిరి భార్య పార్వతమ్మ తలుపు తీసింది. "అమ్మా! బాగున్నారా? శేషగిరి ఇంట్లో ఉన్నాడా?" ప్రశ్నించాను.
"బాగున్నాం అన్నయ్యగారు, రండి లోపలికి" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది...

అనుకుంటూ ఇంటిదారి పట్టాను.

"తప్పు చేసాడని శేషగిరిని సస్పెన్షన్‌లో పెట్టారు కంపెనీవాళ్లు" భార్య కమలతో శేషగిరి విషయం చెప్పాను. ఆ కుటుంబంతో పరిచయం ఉన్న కమల ఆశ్చర్యం ప్రకటించింది. అతని సస్పెన్షన్‌కు దారి తీసిన సంఘటనను ఆమెకు వివరించాను. కమల చాలా బాధపడింది.

"నన్ను మళ్లీ కొన్నాళ్లు కంపెనీలో పని చేయమన్నారు. అదీ శేషగిరి పని చేసిన సీట్లోనే. తగిన వేతనం ఇస్తారట. ఏ విషయం రేపు చెప్తానని వచ్చేసాను. ఇంతకీ ఏమంటావు, చేరమంటావా?" భార్య కమల సలహా అడిగాను.

"రిటైర్ అయిన తరువాత కాలక్షేపంగా ఉంటుందంటే చేరండి, అదీ కొద్ది కాలమే కదా!" అంటూ అర్ధాంగి అంగీకారం తెలిపింది.

మరుసటి రోజు కంపెనీలో జాయిన్ అయిన నేను శేషగిరి చేస్తున్న పనిని ఆకళింపు చేసుకొని ఆచరణలో పెట్టడానికి అట్టే శ్రమ పడలేదు.

ఓ రోజు సాయంత్రం ఆఫీసు పని ముగించుకొని- ఓదార్చుదామని శేషగిరి ఇంటికి బయలుదేరాను. ఇంటిముందున్న కాలింగ్ బెల్ నొక్కగా శేషగిరి భార్య పార్వతమ్మ తలుపు తీసింది.

"అమ్మా! బాగున్నారా? శేషగిరి ఇంట్లో ఉన్నాడా?" ప్రశ్నించాను.

"బాగున్నాం అన్నయ్యగారు, రండి లోపలికి" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది.

"ఏం మూర్తీ! ఎలా ఉన్నావ్?" అంటూ బెడ్ రూంలోంచి వచ్చాడు శేషగిరి. అతనిలో ఇదివరకటి ఉత్సాహం కనిపించలేదు. మనిషి చాలా నీరసపడిపోయినట్లున్నాడు.

"బాగానే ఉన్నాను, మీ అమ్మాయి, అల్లుడూ కులాసాగా ఉన్నారా?" ప్రశ్నించాను.

"ఆc.... ఆc... బాగానే ఉన్నారు..."

"నీకు తెలుసునో లేదో! నేను మళ్లీ మన కంపెనీలో చేరాను. కొన్నాళ్లు పని చేయమని కబురు పెట్టారు మేనేజ్‌మెంట్‌వారు. చిత్రమేమంటే నేను నీ సీట్లో పని చేయడం!

"విన్నాను, ఈ మధ్యనే మన కంపెనీలో జూనియర్ అసిస్టెంటుగా చేరిన బాబూరావు చెప్పాడు. నీకు తెలుసుగా, బాబూరావు మా ఇంటి దగ్గరలోనే ఉంటాడు. ఇలా అవుతుందని అనుకోలేదు మూర్తీ, నన్ను సస్పెన్షన్‌లో పెట్టారు. ఎంక్వైరీ చేస్తారట" చాలా నిర్వేదంతో చెప్పాడు శేషగిరి.

"ఇంతకీ నేను విన్న విషయం నిజమేనా? నువ్వు ఆ కాండిడేట్ దగ్గర డబ్బు తీసుకోవడం వాస్తవమేనా?" నా కంఠంలోంచి వచ్చిన సందేహానికి- "నిజమే మూర్తీ, దానికి కారణం మా అమ్మాయి కాపురమే. నేను పెళ్లిలో ఇస్తానన్న కట్నంసొమ్ము బాకీ పడ్డాను. మా అమ్మాయి అత్తగారు అదేపనిగా ఆ సొమ్ము తెమ్మని అడుగుతూ అమ్మాయిని ఇబ్బంది పాల్జేస్తోంది. అల్లుడు కూడా తల్లికి వంత పాడేడు. అమ్మాయిని తరచుగా ఇంటికి పంపించి డబ్బు తెమ్మని సాధిస్తున్నారు.

అమ్మాయి వేదన చూడలేక ఆ సొమ్మును ఎలా సమకూర్చాలా? అని ఆలోచించాను. పెళ్లికి చేసిన అప్పులు ఇప్పటికీ తీరలేదు. అటువంటి పరిస్థితులలో నాకు వేరే మార్గం తోచక ఆ పనికి పూనుకున్నాను. ఇంతటి తీవ్ర పరిణామాలకి దారి తీస్తుందని తెలుసుకోలేకపోయాను. నేను తప్పు చేసాను మూర్తీ!" అంటూ బోరున విలపించాడు శేషగిరి.

"ఎంత పని చేసావు శేషగిరీ, ఒక్క బ్లాక్ మార్కు లేకుండా ఇన్నేళ్ల సర్వీసు చేసి చివరి దశలో ఇటువంటి చర్యకు పూనుకున్నావు. అయితే నా సలహా ఏమంటే ఎంక్వైరీ పెడుతున్నారని చెప్పావు కదా! ఎంక్వైరీలో నీ తప్పును ఒప్పుకో. దానివలన నీకు ఇంక్రిమెంటు కోత తప్ప ఉద్యోగం పోవడమనేది ఉండకపోవచ్చు. గతంలో ఒకటి రెండు కేసులలో అలా జరిగింది. ఆ అనుభవంతో చెప్తున్నాను" అతన్ని ఎంతో అభిమానించే వాడిగా అనునయించాను.

"నేను అదే అనుకుంటున్నాను, నీవు చెప్పినట్లే చేస్తాను. ఎంక్వైరీలో నా తప్పును ఒప్పుకుంటాను. దానివలన శిక్ష తగ్గవచ్చు" శేషగిరి నేను చెప్పిన ప్రతిపాదనకు అంగీకరించాడు.

"ఇంతకీ అమ్మాయి కాపురం ఇప్పుడెలా వుంది?" అడిగాను కుతూహలం ఆపుకోలేక.

"ఆ ఏభై వేలు ముట్టిన తరువాత అమ్మాయి కాపురం కుదుట పడింది" అంతా డబ్బులోనే ఉంది అన్న ధ్వని శేషగిరి మాటల్లో స్ఫురించింది.

"సరే వస్తాను..." శేషగిరి భార్యకు కూడ ధైర్యం నూరిపోసి అక్కడనుండి సెలవు తీసుకున్నాను.

ఇలా ఓ పది రోజులు గడిచిన పిమ్మట ఓ రోజు "మూర్తిగారూ, శేషగిరికి డిస్మిసల్ లెటర్ తయారు చెయ్యండి. ఇదివరకు క్రమశిక్షణా రాహిత్యం కింద డిస్మిస్ చేయబడిన వారి ఫైల్ చూడండి. ఎంక్వైరీలో శేషగిరి తప్పుఒప్పుకున్నా, అతను చేసిన నేరం చాలా తీవ్రమైనది. పైగా అతన్ని క్షమిస్తే, కంపెనీకి చెడ్డ పేరు కూడ వస్తుంది. అందుకే మేనేజిమెంటువారు ఈ నిర్ణయం తీసుకున్నారు" హెచ్.ఆర్. మానేజర్ సూర్యప్రకాష్ మాటలు నాకు బాణాల్లా గుచ్చుకున్నాయి.

"ఏమిటి! ఆలోచిస్తున్నారు? అర్జంట్‌గా తయారుచేయండి. ఆ లేఖను హెడ్ ఆఫీస్‌కు పంపించి వారి అంగీకారం తీసుకోవాలి" మళ్లీ సూర్యప్రకాష్ రెట్టించాడు.

నా నోట మాట రాలేదు. కొద్ది క్షణాలు స్థాణువులా నిలబడిపోయాను. "సరే సార్!" నూతిలోంచి వచ్చినట్లుగా ఉంది నా మాట. కంప్యూటర్ లేఖను తయారుచేస్తుంటే నా వేళ్లు తడబడ్డాయి. చేతులు ఒణుకుతున్నాయి. నా ఆలోచనలు మళ్లీ గతంలోకి వెళ్లాయి.


"శేషగిరీ, నేను ఎంతో ఆశ పెట్టుకున్న ప్రమోషన్ నాకు రాకుండా చేయడానికి రవీంద్ర శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. తన పేరును ప్రమోషన్ లిస్టులో నా పేరు పైన వేయించుకునేందుకు చాలా తంటాలు పడుతున్నాడు. జనరల్ మేనేజర్ చుట్టూ తిరుగుతూ పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకుంటున్నాడు. వాడికంటే సీనియర్‌నైన నాకు ఆ ప్రమోషన్ రాకుండా పథక రచన చేస్తున్నాడు. నువ్వు కొంచెం కల్పించుకొని హెచ్.ఆర్. మేనేజర్‌ద్వారా నాకు న్యాయం జరిగేటట్లు చూడు..." నాలోని ఆవేదనను శేషగిరి ముందు పరిచాను.

"నువ్వేం కంగారుపడకు. నీ సీనియారిటీ, అనుభవం దృష్ట్యా ఆ ప్రమోషన్ నీకే రావాలి. నీకు తప్పక న్యాయం జరుగుతుంది. ఆ విషయం నాకు వదిలేయ్" శేషగిరి ఇచ్చిన భరోసా నాకు ఎంతో బలాన్నిచ్చింది.

శేషగిరి చెప్పినట్లుగానే, ఆ ప్రమోషన్ నాకే వచ్చింది. శేషగిరికి కృతజ్ఞతలు చెప్పాను. అతని రుణం తీర్చుకోగలనో లేదో! అని లోలోనే మథనపడ్డాను. ఈ లోకంలోకి వచ్చిన నన్ను హెచ్.ఆర్. మేనేజర్ పిలుస్తున్నారంటే ఆయన ఛాంబర్‌కి వెళ్లాను.

"డిస్మిసల్ లెటర్ తయారయిందా?" ఆత్రుతంగా అడిగిన సూర్యప్రకాష్ ముందు ఆ లేఖను పెట్టాను. ఆ లేఖను చూసి హెడ్ ఆఫీస్‌కి పంపించమన్నాడు.

"అలాగే" అంటూ ఆయన ఛాంబర్‌లోంచి బయటకు వచ్చి- "కాలం ఎంత విచిత్రమైనది, నాకు ఈ కంపెనీలో ఉద్యోగం లభించడంలో, ప్రమోషన్ రావడంలోనూ తోడ్పాటు నందించిన శేషగిరికి నా చేతులతోనే ఉద్యోగం పోయే ఏర్పాటు చేస్తున్నాను. శేషగిరి రుణం ఇలా తీర్చుకుంటున్నాను" నా హృదయం ఆర్ద్రమయింది. నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. హెడ్.ఆఫీసు అంగీకారం వచ్చిన తరువాత, ఆ లెటర్‌ను శేషగిరి చిరునామాకు పోస్ట్ చేసి, కంపెనీ నోటీస్ బోర్డ్‌లో కూడా పెట్టే ఏర్పాటు చేసాను. అంతటితో ముగిసింది శేషగిరి ప్రస్థానం కంపెనీలో. శేషగిరికి రావలసిన సొమ్ము కూడా చెక్ రూపంలో లేఖకు జతచేసి పంపించడమైంది.



ఓ నాలుగు రోజుల అనంతరం శేషగిరి ఇంటికి వెళ్లిన నేను అక్కడి దృశ్యం చూసి నిర్ఘాంతపోయాను. పోలీసు జీపు కూడా అక్కడ పార్కు చేసి ఉంది. ఇరుగు-పొరుగువారు అక్కడ చేరి గుసగుసలాడుకుంటున్నారు. ఏమి జరిగి ఉంటుందా? అని లోపలికి తొంగి చూసాను. పోలీసువారు శేషగిరిని తీసుకొచ్చి జీపులో ఎక్కిస్తున్నారు. అతనిపై పోలీసు కేసు కూడా పెట్టినట్లు, ఆ విషయం కంపెనీవారు అతి రహస్యంగా ఉంచినట్లు నాకు తర్వాత తెలిసింది.

ఇది ముమ్మాటికీ శేషగిరి స్వయంకృతమే అనుకుంటూ... శేషగిరిని తీసుకువెళ్తున్న జీపువంక చూస్తూ స్థాణువులా నిలబడిపోయాను. ■

చిన్న కథ

కోతి తోక ఊడ్చింది...

తిరిగే గడియారం నన్ను తరిమినట్టు చేయలేదుగాని సంపూర్ణమ్మ మాత్రం నాతో పరుగులు తీయిస్తోందనుకుంటూ.... పరుగులాంటి నడకతో బ్యాంకుకు వస్తున్నాడు, ముకుందరావు.

"ఏం సారు! నేను మీ బ్యాంకి పైనుండే సిట్‌ఫండ్ ఆఫీసులోన, మీ బ్యాంక్ కింద ఉండే చెప్పుల షాపులోన కసువు ఊడ్సేయల్నా. నాకు టైం సాల్దు సారు..." అని మొర పెట్టుకుంది సంపూర్ణమ్మ.

"ఏం చేద్దామమ్మా! మా అటెండరు సిద్దప్ప లీవు పెట్టె... నా చావు కొచ్చినట్లుంది నా కథ. దయచేసి మా బ్యాంక్‌లోన ఊడ్చేస్తువు... రామ్మా!!" అని టక టకమని సెకండు ఫ్లోర్లో ఉన్న మెట్లెక్కాడు ముకుందరావు.

"సంపూర్ణమ్మ... స్వాగతం తల్లీ!" అని నవ్వుతూ దోరు తీశాడు. ఈ బ్యాంక్‌లో లైటు స్విచ్ వేసే కాడినుండి సిస్టమ్ ఆఫ్ చేసే స్విచ్ వరకు నేనే చూసుకోవాల. నువ్వు పైనున్న ఆఫీసులో స్వీపర్‌గా ఉన్నావు కాబట్టి మా సిద్దుడు లీవు పెట్టినా ఆదుకుంటండావమ్మ.." అని సంపూర్ణమ్మను పొగడుతూ మాట్లాడాడు.

ముకుందరావు మాటలు వినే టైం లేని సంపూర్ణమ్మ టైమెల్లిపొతాంది సారు... అని సర్రు సర్రుమని ఊడ్చేసింది.

"అమ్మా! తల్లీ! ఈయాల మా ఆరెమ్ముగారొస్తున్నారు. బయట మెట్లు పక్కన పొదవున ఉన్న వరండా అట్ల సర్రు... సర్రుమని ఊడ్చేయమ్మ ..." అని పల్చ పల్చగా నవ్వుతూ చెప్పాడు, ముకుందరావు.

"సారు... నాకు టైము లేదంటే?" "అమ్మ...అమ్మ ఇంకో పది రూపాయలు ఎక్కువే ఇస్తాను. ఊడ్చేయమ్మ. లేదంటే నేనూడ్చుకోవాల" అని ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

కొద్దిసేపటికి..

"సారు...ఓ సారు... అని సంపూర్ణమ్మ భయంగా అరిచింది. ఏమ్మా... ఏమ్మా" అంటూ బ్యాంక్ లోపల్నుండి తొందరగా వచ్చాడు.

ఈ వరండాలో పాము పోయినట్లుంది జాడ కూడ కనిపిస్తంది" అంది భయంగా. వరండాలో దుమ్ము నిండిన కారణంగా పాము వెళ్లినట్లు జాడ కనిపించింది ముకుందరావుకు. పరిశీలిస్తూ ముందుకు కదిలాడు.

ఇంతలో గ్రౌండ్ ఫ్లోర్‌నుండి ఓ కోతి ఆపిల్ పండు నోటికి కర్చుకొని పై ఫ్లోర్‌కు ఎగబాకుతూ కనిపించింది. అమ్మో.... సంపూర్ణమ్మా! ఇలా పామెల్లలేదు. కోతి తోక ఈడ్చుకుంటు వెళ్లింది" అని పక పక నవ్వుతూ చెప్పాడు, ముకుందరావు.

- ఎం.రామచంద్ర

కింగ్ కోఠి

అతనికి చాలా మంది భార్యలుండేవారు
వారంతా ఏమయ్యారూ?

వాళ్ళా, వాళ్ళలో కొంత మంది
వారి వారి స్వగ్రామాల గాలి
వెతుక్కున్నారు
మరి కొంతమంది అక్కడా ఇక్కడా
తల దాచుకునే నీడ వెతుక్కున్నారు
కొందరు చార్మినారును పూలదండలల్లి
అమ్మడం మొదలుపెట్టారు
పాత నగర ప్రాభవం, దాని తాలూకు
ధూళీ
ప్రస్తుతం వారిమీద గొప్పగా, మెత్తగా
పరుచుకుని ఉంది-

వారిలో ఇంకా కొందరు
నువ్వూ నేనూ చూసే, ఆ దారిన నడిచే
చివరంటూ లేని మురికి, ఇరుకు
గొందులు కూడా అయ్యారు-

అందరి ముందు ఆడుతూ పాడుతూ
కొంత మంది నర్తకులయ్యారు
ప్రేమకు వర్తకులయ్యారు
వివిధ దారులలో.. దారుల కూడలిలో
వాళ్లు చనిపోయినప్పుడు
ఎవరూ రాలేదు-
సమాధులు కట్టడానికొక్కాదు కదా..
కనీసం శ్రద్ధాంజలి ఘటించడానికి!
దాన్ని ఇంకా కింగ్‌కోఠి అనే పిలుస్తారు-

- డాక్టర్ దేవరాజు మహారాజు

రేపటికి.....

ప్రతి సంఘటన గుండె గుడిలో ముద్ర
ఒక్కొక్క రోజు ఒక్కొక్క సమయం
ఒక్కొక్క మూడ్
ఒక దిశా నిర్దేశంలో
నీవే నేనూ అనుకోని అద్భుతాంశాలు
ఎదురుపడేను.
అనుకోకుండానే విషమ ఘడియలు చుట్టుముడుతాయి.
ఒక సన్నివేశంలో మనిషి మనిషిననే
లోక దృక్పథాన్ని మర్చిపోతారు.
బతుకు రాదారిలో ఊపిరి సలపనివ్వని
అగ్ని గోళాంశాల సమస్యల జాడలు ఎదురై
చవి చూస్తూ వుంటాం.
ఆశయాల చాలులో రాళ్లు ముళ్ల
పరుస్తారు... ఇంకొందరు కురిపించే మరోచోట
మెత్తని గులాబీల వర్షం
నడిచే లోకం తీరు ఒక్కొక్కసారి ఆశ్చర్య చిత్రం
ముఖం చూసి బొట్టు పెడతారు
లక్కీ లేని మనిషి బతుకు మైదానం
అలుముకొన్న అమావాస్య కఠిన నలుపు.

అక్కడక్కడ చిన్ని చిన్ని ఆశల మిణుగురులు
మెరపుపూలు రువ్వుతూనే వుంటయ్

స్నేహితుల కాలం ఉపకారం
మోసపు కన్ను విద్రోహం
అందరి క్షేమ బాటలను పర్చేవారు
ఎందరో కాలానికి ఆదర్శాల గ్రంథ
పాఠకులవుతారు రేపటికి.

- అంజనాశ్రీ

నాలో నేను....!

ఈశ్వరుడు ఎంత దయామయుడో!
నా మీద ఎంతో ప్రేమతో
ఈ సుందరమైన సృష్టిలోకి పంపాడు.
అందమైన ప్రకృతిని.. చల్లని గాలిని.. చెట్టుని..
నదిని.. సముద్రాన్ని.. ఆకాశాన్ని.. అనంతాన్ని
ఒకటేమిటి... ఎన్నో అద్భుతాలను
సృజించి ఇచ్చాడు.
కోటానుకోట్ల జీవరాశులలో
అన్నింటికంటే గొప్ప జ్ఞానాన్నిచ్చాడు
నాలో ఉన్న తన రూపాన్ని
నాకు నేను తెలుసుకునే తెలివిచ్చాడు
నేనేమో...
చుట్టూ ఉన్న ఆహ్లాదమైన ప్రకృతిని వొదిలి
నాలో ఉన్న దైవత్వాన్ని మరిచి
దేనికోసం పరిగెడుతున్నాను
అర్థం కాకుండా ఉన్నాను.

- మార్టూరి శ్రీరామ్‌ప్రసాద్

సూర్యకిరణాలు!

హృదయ కవాటాలు
తెరచుకుంటేనే కదా
సూర్యకిరణాలు
సూటిగా పడేది!
అప్పుడే కదా
మసకబారిన
మనోనేత్రాలు
స్వచ్ఛంగా... స్వచ్ఛందంగా
విచ్చుకునేది!
ఆ విచ్చుకున్న నేత్రాలకు
తరతరాల రంగుల కలలు
సాకారమై పరచుకుంటాయి!
కాల గమనంలో
మానవీయ విలువలు
నిండుగా వలువలు
తొడుక్కుంటూనే ఉంటాయి!

వెలుగు దారులు అంతటా
స్వాగతిస్తూనే ఉంటాయి!!

- కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం



పందెం

- కృష్ణ మాధవరపు

"ఏవయ్యోయ్! నిన్నే! వినబడిందా? అల్లుడు బెమ్మానందం గురించి లోకం కోడై కూసేది నీ చెవుల్లో పడలేదా?" అని వీరాయమ్మ రెకాయించేసరికి సదరు ఏవయ్యోయ్ "ప్రపంచకం కోడిలా కుయ్యటానికి అల్లుడుగారు అంత కాని పని ఏం చేసాడు? మెల్లగా పళ్ల కొరికి "ఆస్తి పాస్తులుండి నోరున్న పెళ్లాంతో ఏగడం దిన దిన గండం నూరేళ్లాయుష్షుతో సమానం" అని ఏవయ్యోయ్ గొణుగుతుంటే-

"ఏంటీ? నీలో నువ్వే సణుక్కుంటున్నావు?" అని భార్య అంటే- "నువ్వన్నది అక్షరాలా నిజం అనుకుంటున్నాను" అంటే-

వీరాయమ్మ "నువ్వెలా అనుకున్నా నాకెలాంటి యిబ్బంది గట్రా వుండదు" అంటుంటే- అందుకేగా మా యమ్మ పట్టు పట్టి నీకు నన్నిచ్చి పెళ్లి చేసింది" అంటే- "మీ యమ్మ వెర్రిబాగుల్ది కాదు. పనీ పాటా చెయ్యలేని అర్భకుడివి. పైగా చేత చిల్లిగవ్వ లేనోడివైన నీకు కూటికి, గుడ్డకి, గూటికి లోటు రాకూడదని బాగా ఆలోచించి మేనరికం చేసింది" అనేసరికి- అర్ధాంగి చెప్పింది అబద్ధం కాదు కనుక ఏవయ్యోయ్ నోరు మెదపలేదు.

ఏదయినా అంటే తన బీదరికాన్ని జ్ఞాపకం చేస్తుందన్న భీతితో "ఇంతకీ మన అల్లుడుగారు వెలగబెట్టిన ఘనకార్యం ఏమిటట?" కన్నతండ్రిలా ప్రశ్నించాడు.

"నాకు నోరు రావడం లేదు చెప్పడానికి. అవ్వం" అంటూ నోరు నొక్కుకుని ఆగింది. వెంటనే "అయితే అల్లుడుగారు సిగ్గుకి సిగ్గొచ్చే ఎదవపని చేసి వుంటాడు" అంటే- వీరాయమ్మ "సిగ్గుకి సిగ్గొచ్చిందో! ఎగ్గుకి ఎగ్గొచ్చిందో తెలీదు కాని అల్లుడీమధ్య దేవుళ్లకి దణ్ణాలు పెట్టినట్టు... మధ్యలో ఏవయ్యోయ్! అమ్మాయికి పెడుతున్నాడా?" అంటే-

వీరాయమ్మ "అలా చేసినా బావుండును. ఎవరు హర్షించినా హర్షించ కపోయినా సంతోషించేదాన్ని" ఏవయ్యోయ్ టెన్షను భరించలేక "ఇంతకీ ఎవరికి దండాలు పెడుతున్నాడు?" ఆత్రంగా అడిగాడు.

"టీ.వికి. టీవి ఎక్కడ కనబడితే అక్కడ ఇంటా బైటా తేడా లేకుండా సాష్టాంగపడిపోతున్నాడట. అది చూసిన జనం ముక్కుమీద వేలేసుకుని పొట్ట చెక్కలయ్యేలా పడి పడి నవ్వుతున్నారంట!" అసలు సంగతి బైట పెట్టింది.

ఏవయ్యోయ్ నిర్ఘాంతపోయాడు. ఎందుకూ పనికిరానివాడయినా గుడికి, గుళ్లో దేవుడికి, విద్య నేర్పిన గురువుకి, జన్మనిచ్చిన తల్లిదండ్రులకి కుంకుమబొట్లు పెట్టిన రాయికి రప్పకి దండాలు పెడతారు. అవసరమైతే సాష్టాంగపడతారు. ఇవన్నీ వదిలిపెట్టి ప్రత్యేకంగా టి.వి.కే ఎందుకు దణ్ణం వగైరా చేస్తున్నాడు? అల్లుడిగారి యవ్వారం వింతలకి వింతలా వుందే!" అనుకున్నాడు.

"ఈ దణ్ణాల సంగతి అమ్మాయి ఫోన్లో చెప్పిందా?" అంటే-

"కాదు. మన ఇరుగు-పొరుగుకి వాళ్ల బంధువులవల్ల తెలిసి తనకి చెప్పేరంది" వీరాయమ్మ.

మనమ్మాయి తన భర్త సంగతి మనకి చెప్పలేదంటే ఇరుగు-పొరుగు చెప్పింది నిజమైతే టి.వి. దణ్ణాల్లో ఏదో మతలబు ఉంటుందన్నాడు ఏవయ్యోయ్. అది తెల్చుకోవడానికి కూతురి ఊరు వెడతానంటే వీరాయమ్మ వెళ్లమంది.

ప్రయాణమైన భర్తతో "కొత్త కొత్త టీ.వి.చానళ్లలా రోగాలు, రొష్టులు కొత్తవి పుట్టుకొస్తున్నాయి. వెళ్లీ వెళ్లగానే అమ్మాయితో వివరంగా మాట్లాడి అల్లుడిని పెద్ద డాక్టరికి చూపించండి. ఒక్కగానొక్క పిల్ల! తొలి కాన్పులో పుట్టింది. మలి కాన్పులో మగబిడ్డ పుడతాడని నేను ఆశ పడుతుంటే పాపయినా, బాబయినా కన్నవారికి, పుట్టిన ఊరికి పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టే సంతానమే వంశాంకురాలు. కనుక పాపని చక్కగా పెంచుకుంటూ విద్యాబుద్ధులు నేర్పిద్దాం.. అని నాకు హితవు చెప్పి, వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నావు. పాపకి మహాలక్ష్మి అని పేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసి ఓ అయ్య చేతిలో పెట్టాం. ఇప్పుడేమయిందో చూడు!" అని వీరాయమ్మ మాతృహృదయం బాధపడింది. భర్తతో పంచుకుంది. కష్టసుఖాలు సతీపతుల్లాంటివి అని భారతీయ వివాహబంధం పటిష్టత, విశిష్టత.

భర్తని బహిర్ముఖంగా ఏవయ్యోయ్ అని సంబోధించే వీరాయమ్మ అంతరంగంలో పతి స్థానం ప్రథమ స్థానమే.

బస్సు దిగిన ఏవయ్యోయ్ గబగబా కూతురింటి మెట్లెక్కి అప్రయత్నంగా వీధిగుమ్మం పక్కన నిలబడి, ఆత్రంగా లోపలికి చూసాడు.

హాలు మధ్య కుర్చీలో వున్న మహాలక్ష్మి జలపాతంలా ఏడుస్తూ మధ్య మధ్య కొంగుతో కళ్లొత్తుకుంటోంది. ఆ విషాద రోదన ఘట్టానికి కారణమైన దుఃఖ సన్నివేశాన్ని డైలీ సీరియల్ టీ.వీ.లో వీక్షిస్తున్న మహాలక్ష్మి సర్వం మరచిపోయింది. కనుకనే తండ్రి రాకను సైతం గమనించలేదు. ఆటో శబ్దం విన్పించుకోలేదు. ఆ ఉత్కంఠ సమయంలో బైటినుండి వేంచేసిన అల్లుడు బ్రహ్మానందం పిల్లనిచ్చిన మామగారిని చూసి కూడా ముందు టి.వి.కి దణ్ణం పెట్టాడు. తర్వాత రోదిస్తున్న అర్థాంగిని గాంచి ఆనందపరవశుడైపోతూ మళ్లీ రెండు దండాలు పెట్టాడు. అనంతరం అదంతా విస్మయంగా చూస్తున్న మామగారికి నమస్తే చెప్పి, లోపలికి ఆహ్వానించాడు.

ఏవయ్యోయ్ అచేతనంగా అడుగు కదిపాడు.

అకస్మాత్తుగా తండ్రి, భర్తా ఒకేసారి రావడం చూసిన మహాలక్ష్మి దిగ్గున లేచి నిలబడి టి.వి. కట్టేసి తండ్రిని కూర్చోమని, భర్తని మాట్లాడమని చెప్పి కాఫీకోసం లోపలికి వెళ్లింది.

ఏవయ్యోయ్ కూర్చుంటూ అల్లుడిని యోగక్షేమాలు అడుగుతూ పరిశీలించాడు. ఎలాంటి ఉన్మాద లక్షణాలు కన్పించలేదు. గౌరవ మర్యాదలతో సంభాషించాడు. అంతా బాగానే వుంది కానీ టి.వి.కి ముమ్మారు దణ్ణం పెట్టడం, ఏడ్చే భార్యని ఆనందంగా చూడ్డం ఎందుకో అర్థంగాక అడగలేక- చల్లకొచ్చి ముంత దాచినట్టు ప్రవర్తించడం భావ్యం కాదని "బాబూ! నువ్వు మాకు అల్లుడివయినా కొడుకుతో సమానం. మీ క్షేమమే మా క్షేమం. మన మధ్య అరమరికలు ఉండకూడదు. నేనెందుకు అకస్మాత్తుగా రావల్సి వచ్చిందో చెబుతున్నాను. నీ గురించి మా ఊళ్లో వింతగా చెప్పారు. అది విని మేం కంగారు పడ్డాం. తెలుసుకుందామని వచ్చాను. కళ్లారా చూసాను. మేం విన్నది నిజం చేసారు. ఇలాగే బైటా దణ్ణాలు పెడుతున్నారట. కారణమేమిటి? ఏడ్చే మా అమ్మాయిని మహదానందంగా ఎందుకు చూసారు? దానికారణ మేమిటి?" అనేసరికి-

బ్రహ్మానందం చిరునవ్వుతో "మీరు నన్ను తిట్టినా, కోపగించినా చిన్నబుచ్చుకోను, బాధపడను. ఈ మధ్య నేను, మీ అమ్మాయి సరదాగా ఒక పందెం వేసుకున్నాం. ఆ బెట్ ప్రకారం నేను ఏదో విధంగా మహాలక్ష్మిని కన్నీటిపర్యంతం ఏడ్పించాలి. తను నవ్వాలి తప్ప ఏడ్వకూడదు. ఒక్క కన్నీటి బొట్టు కూడా కన్నీరు రాల్చకూడదు. రాల్చను గాక రాల్చనంది. వలవలా ఏడ్పించి తీరతానన్నాను. మహాలక్ష్మి నా వల్ల కాదని ఎద్దేవా చేసింది. నాలో పంతం పెరిగింది. ఏడ్పించి తీరతానని ఛాలెంజ్ చేసాను. ఆ క్షణంనుండి అనేక ప్రయత్నాలు చేసాను. కొట్టినా తిట్టినా నవ్వింది తప్ప ఏడ్వలేదు. నేను పందెంలో ఓడిపోతానేమో! అనుకున్న తరుణంలో మీరు పండగ బహుమానంగా టి.వి. పంపి నా నెత్తిన పాలు పోసారు. టివి మా ఇంట అడుగు పెట్టిన క్షణంనుండి చాంతాడు లాంటి గొలుసుకట్టు భయంకర విషాదభరిత సీరియళ్లు చూడ్డం మొదలుపెట్టి ఏడ్పుకి బానిసైపోయింది. పందెం షరతు ప్రకారం ఎలా ఎందుకేడ్చినా ఓటమికిందే లెక్క. ఆ విధంగా మహాలక్ష్మి ఓడిపోయింది.

నేను గెలిచాను. నన్ను అనూహ్యంగా గెలిపించిన టి.వి.కి రుణపడిపోయాను. రుణవిముక్తికోసం టి.వి. ఎక్కడ కనబడితే అక్కడ దండాలు పెట్టడం ప్రారంభించి కొనసాగిస్తున్నాను" అని ముగించేసరికి ఏవయ్యోయ్‌కి నవ్వాలో ఏడ్వాలో అర్థం గాక బుర్ర గోక్కుంటూ కూతురు టి.వి. పిచ్చికి, అల్లుడి టి.వి. భక్తికి, తను టి.వి. కొనిచ్చి తప్పు చేసినందుకు మనస్సులో మౌనంగా లెంపలు వేసుకున్నాడు ఏవయ్యోయ్.

■

.. డబ్బు నిలవడం లేదు!

వాస్తువార్త

వాస్తువిద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్- 3
సెల్స్: 9885446501/ 9885449458



చలపతి - మార్కాపురం

ప్రశ్న: ఉత్తర భాగంలో పల్లమున్న స్థలం వాస్తు ప్రకారం చాలా మంచిదని వాస్తు సిద్ధాంతి చెప్పారు. కాబట్టి అటువంటి స్థలం కొన్నాను. ఉత్తరపు దిక్కున పల్లంలో ఒక గది కట్టి ఉపయోగిస్తున్నాం. కానీ మాకు ఏమాత్రం బాగాలేదు. డబ్బు నిలవడం లేదు. అనేక విధాలుగా నష్టాలను, కష్టాలను ఎదుర్కోవలసి వస్తున్నది. ఈ స్థలాన్ని అమ్మేయాలని అనుకుంటున్నాం. మీ సలహా చెప్పగలరు.

జవాబు: వాస్తు సిద్ధాంతి మీకు సరయిన సలహా ఇచ్చాడు. ఉత్తర దిక్కుకు పల్లం వున్న క్షేత్రం సాధారణంగా ధన ధాన్యాదుల వృద్ధి, సుఖం, కీర్తి, ఐశ్వర్యాలను కలిగిస్తాయి. కానీ అలాంటి క్షేత్రంలో ఉత్తర దిక్కున పల్లంలో పాకలు, షెడ్డులు, పందిళ్లు మొదలయినవి నిర్మించటంవల్ల అనేక దుష్ఫలితాలు పొందాల్సి వుంటుంది. మీ స్థలంలో ఉత్తర భాగంలో పల్లంలో ఒక గది నిర్మించి వాడుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆ వాస్తు దోషంవల్ల మీరు అనేక కష్టాలను ఎదుర్కోవలసి రావటంలో ఆశ్చర్యం లేదు. ముందు ఆ గదిని నిర్మూలించి నైరుతి భాగంలో నిర్మించండి. మంచి ఫలితాలు తప్పకుండా వస్తాయి. ఆ స్థలాన్ని అమ్మవలసిన అవసరం లేదు. అలాంటి మంచి స్థలాలను అమ్మకూడదు కూడా!

ఆర్థిక ఇబ్బందులు తొలిగేదెలా?

సి.ఎస్ - మచిలీపట్నం

ప్రశ్న: దక్షిణం వైపున వున్న అద్దె ఇంటినుండి ఉత్తరం వైపు వున్న అద్దె ఇంటికి వచ్చిన తరువాత వ్యాపారం కలిసి వచ్చింది. స్థలం కూడా కొన్నాం. స్థలం కొన్నాక దక్షిణ హద్దులో చెట్లు, నైరుతి మూలన వున్న చెట్లు నరికివేశాం. మేం ఈ స్థలంలోకి ఉత్తరం దిక్కు నుండి దక్షిణం దిక్కు నైరుతి మూలకు వచ్చాం. ప్రస్తుతం ఈ స్థలం నుండి నైరుతి మూల వున్న అద్దె ఇంటికి మారాం. తరువాత విపరీతమయిన ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారం ఆగిపోయింది. ఇంటికి పెద్దవాడినయిన నేను ప్రాణగండం నుండి బయట పడ్డాను. మా నాన్న నిచ్చెన మీద నుండి కింద పడి చెయ్యి మణికట్టు విరిగింది. తమ్ముడు కిడ్నీ సమస్యతో చాలా బాధపడుతున్నాడు. ప్రస్తుతం ఇంట్లోనివారి మాట కలవక చాలా ఇబ్బంది పడుతున్నాం. మా ఇబ్బందులు తొలగిపోయేదెలా?

జవాబు: మీరు కొన్న స్థలం తాలూకు ప్లాను పరిశీలించి చూస్తే ఆ స్థలం కొన్ని రకాల వేధ దోషాలను కలిగివున్నదని తెలిసింది. గృహాంతర్భాగంలోగానీ, గృహ పరిసరాలుగాని తూర్పు, ఉత్తరాలు పల్లంగా వుండి- పశ్చిమ, దక్షిణాలు ఎత్తుగా వుండాలి. అలా కాక తూర్పు, ఉత్తరాలు ఎత్తుగా వుండి పశ్చిమం లేదా దక్షిణం వాలుగా వున్నప్పుడు కొన్ని రకాల వేధ దోషాలు వుంటాయి. ఇలాంటి వేధ దోషాలవల్ల ఆ స్థల సొంతదారు రకరకాల ఇబ్బందులకు గురవుతారు, ఋణగ్రస్థులు కూడా అవుతారు. ఇలాంటి వేధ దోష వున్న స్థలాన్ని వుంచుకోవడం మంచిది కాదు. మీ స్థలానికి సంబంధించి పడమర వైపు చెరువు వున్నది. మీ స్థలానికున్న ఈ వేధ దోషం నవరించడానికి వీలు లేదు. కాబట్టి ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోండి. అలాగే ఇప్పుడు మీరున్న అద్దె ఇంటి వాస్తును కూడా ఒకసారి సరిచూసుకోండి.

ఎన్ని ద్వారాలు ఉండాలి?

వెంకటేశ్వరరావు - చీరాల

ప్రశ్న: మేం ఇల్లు కడుతున్నాం. ద్వారాల గురించి నాకు మీ సలహా కావాలి. మేం రెండు పోర్షన్లతో ఇల్లు కడుతున్నాం. వాటికి పది ద్వారాలు, పన్నెండు కిటికీలు వచ్చాయి. 10 ద్వారాలు వుండవచ్చా? ఈ పది ద్వారాలు, టాయిలెట్స్, బాత్‌రూమ్‌లను లెక్కలోకి తీసుకోలేదు.

జవాబు: మీరు ఈశాన్యం తెరవండి. తప్పకుండా మంచి ఫలితం వుంటుంది. ద్వారాల సంఖ్య 8 లేదా 12 ఉండవచ్చు. అలాకాక కింద ఒక పోర్షన్, పైన ఒక పోర్షన్ వున్నప్పుడు కింద పోర్షన్ సంఖ్య 4 లేదా 6 వుండాలి. టాయిలెట్, బాత్‌రూమ్‌లకు వుండే తలుపుల చుట్టూ ఫ్రేమ్ లేకుండా వున్నప్పటికీ.. తలుపులున్న గోడలు పై కప్పుకు తగలకుండా వున్నప్పటికీ తలుపులు రేకులతో చేసినవయినా గ్రిల్ తలుపులయినా వాటిని ద్వారాల కిందకు లెక్కించరాదు. ద్వారాల సంఖ్య 2,4,6,8,12,14,16,18,22- ఇలా సరి సంఖ్యలో వుండాలి. చివరన 0 వచ్చేలా 10, 20,30 వుండకూడదు. ద్వారాల సంఖ్యను ఒక అంతస్తుకు పరిమితం చేసుకొని లెక్క వేసుకోవాలి. కానీ మొత్తం భవనం 3 అంతస్తులుంటే ఆ 3 అంతస్తుల భవనంలో వున్న ద్వారాలన్నిటికీ కలిపి లెక్కించకూడదు. అలా లెక్కించడం వల్ల ద్వారాల మొత్తం సంఖ్య సరి అయినప్పటికీ ఒక్కో అంతస్తుకీ బేసి సంఖ్య వచ్చే అవకాశముంది. ఇంటి బయటకు తెరుచుకునే తలుపులకు మెష్ తలుపులు కూడా బిగిస్తూ వుంటారు. లోపలికి చెక్క తలుపులు, బయటకు మెష్ రెండూ వున్నప్పటికీ అలాంటి ద్వారాలను ఒక్క ద్వారంగానే పరిగణించాలి.

..... ఇల్లు కొనలేకపోతున్నాను..!

రాధాకృష్ణమూర్తి - విజయవాడ

ప్రశ్న: 14 సంవత్సరాల క్రితం అన్నదమ్ముల భాగాల పంపకాలలో దక్షిణ సింహద్వారం వున్న ఇల్లు నా వాటాకు వచ్చింది. దానికి ఉత్తరం వైపు రోడ్డు వున్నది. పాత వాస్తు ప్రకారం(ఈశాన్యంలో లెట్రిన్) వున్నది. ఆ ఇల్లు అద్దెకు ఇచ్చి ఉత్తర సింహద్వారం వున్న ఇంట్లో అద్దెకుంటున్నాను. 'య' వర్గులకు ఉత్తర సింహద్వారం వున్న ఇల్లు మంచిదని మీరు రాసారు. ఉత్తర సింహద్వారం వున్న ఇల్లు ఎంత ప్రయత్నించినా కొనలేకపోతున్నాను. ఇచ్చిన అడ్వాన్సులు కూడా పోగొట్టుకున్నాను. నా పేరుకు ఏ దిక్కు సింహ ద్వారం బాగుంటుందో తెలియజేయగలరు.

జవాబు: మీకు మీ వ్యవహార నామరీత్యా ఉత్తర సింహద్వారం యోగిస్తుంది. ప్రస్తుతమున్న ఇంటికి దక్షిణ నైరుతి సింహద్వారమున్నది. ఉత్తర వాయువ్యంలో సాధారణ పెరటి ద్వారమున్నది. ఈశాన్యంలో టాయిలెట్స్ వుండటం, ఈశాన్యం మూత వేయటం కూడా వాస్తురీత్యా తీవ్రమయిన దోషమవుతుంది. ఆ ఈశాన్య మూలనున్న టాయిలెట్స్, బాత్‌రూమ్ తీసేసి ఆకాశానికి తెరిపి చేయాలి. మీ ఇంటికి ఉత్తర ఈశాన్యం నుండి దక్షిణ ఆగ్నేయానికి నడక వచ్చేలా (ఆ తలుపులను) అమర్చండి. దారిలో గోతులు లేకుండా జాగ్రత్త పడండి. ఉత్తర ముఖ ద్వార గృహాన్ని కొనాలన్న మీ కోరిక తప్పకుండా తీరుతుంది. ■

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు** కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు: ---------------------------------------
పుట్టినతేదీ:------------------ ఊరు: --------------
జన్మనక్షత్రం:----------తల్లిపేరు:--------------------
చిరునామా: ------------------------------------
------------------ ఫోన్: ----------------------

పర్సనల్ పాయింట్

చల్లా సుబ్రహ్మణ్యం

1 సి-ఐక్యూ టవర్స్, 3-4-540,
నారాయణగూడ, హైదరాబాద్-27
మొబైల్: 9866362224/ 9553662224
challascounsel@gmail.com
www.challascounsel.com



ఆయన సంతోషంకోసం అబద్ధం చెప్పాను...

యస్.వి - ఉప్పల్

ప్రశ్న: మా పెళ్లయి ఆరు సంవత్సరాలైంది. మా వారు మార్కెటింగ్ కంపెనీలో పని చేస్తున్నారు. ఆయన వృత్తిరీత్యా ఊళ్లు ఎక్కువగా తిరుగుతుంటారు. వారంలో మూడు రోజులు ఇంటిదగ్గర, నాలుగు రోజులు వేరే ఊళ్లో ఉంటుంటారు. మా ఆయనకి అనుమానం ఎక్కువ. త్వరగా ఎవర్నీ నమ్మడు. ఆఖరికి వాళ్ల అమ్మ, నాన్న, అన్నయ్య, తమ్ముడిని కూడా. నా విషయంలో అయితే ఆయన ధోరణి మరీ విపరీతంగా ఉంటుంది. రెండు నెలల క్రితం నేను, మా వారు కలిసి షాపింగ్ మాల్‌కి వెళ్లాం. అక్కడ ఒక అబ్బాయి నన్ను అదే పనిగా చూస్తూ... మా చుట్టూనే తిరిగాడు. నేను మొదట ఆయనకు తెలిసినవాడేమో అనుకున్నాను.షాపింగ్ చేశాక తిరిగి ఇంటికి వచ్చే దారిలో బైక్‌మీద "ఆ అబ్బాయి ఎవరూ? నిన్ను తాకుతూ వెళ్లాడు" అని అడిగారు. అసలు నాకు అతని చేయి తాకినట్టుగా కూడా అనిపించలేదు. అతను గమనించడం.. చుట్టూ తిరగడం నాకు అర్థమైంది. కానీ తాకలేదు అని నేను ఖచ్చితంగా చెప్పగలను. "నాకు అతనెవరో తెలీదు" అని చెప్పాను. కానీ ఆయన ఎప్పటిలాగా విషయాన్ని సాగదీసి కొన్ని గంటల పాటు దాన్ని పిల్లల ముందు కూడా చర్చించారు. ఆయన అడిగిన ప్రశ్నలు:

1) అతను నీకు ముందే తెలుసా? 2) ఎక్కడ పరిచయం... ఎలా పరిచయం? 3) ఎన్నిసార్లు కలిసారు? 4) నీకు అతను తెలియకపోతే... అతను నిన్నే ఎందుకు చూశాడు అంత పెద్ద మాల్‌లో? 5) అతను నిన్ను కావాలనే తాకాడు కదా! ఈ ప్రశ్నలు ఒక రెండు రోజులపాటు ఆఫీసు సెలవు పెట్టుకుని మరీ నన్ను వేధించారు. అడిగిన ప్రశ్నలే... ఎన్ని రకాలుగా అంటే కోపంగా, ప్రేమగా, ఏడుస్తూ.. బుజ్జగిస్తూ.. అడిగారు. ఆయన బాధ... ప్రవర్తనా చూడలేక ఆయన సంతోషంకోసం 'అబద్ధం ఆడాను', ఆ అబ్బాయి నాకు ఇదివరకే తెలుసని, పరిచయం ఉందనీ చెప్పాను. అలా చెబితే ఆయన శాంతిస్తారనీ, గొడవ చేయడం మానేస్తారనీ చెప్పాను. కానీ అలా చెప్పినప్పటినుంచి ఆయన పద్ధతి చాలా వింతగా మారింది. "అతను తెలిసినా తప్పేంటి" అని మొదట అని ఆ తర్వాత బలవంతంగా నేను చెప్పిన అబద్ధాన్ని 'కథ'లా మార్చేశారు. అసలు ఆ మనిషి ఎవరో... తాకాడో? లేదో? కూడా తెలీదు నాకు. ఆయన తృప్తి పడతారని చెప్పిన విషయాన్ని... రెండు నెలలుగా నాకు నరకం చూపిస్తున్నారు. తర్వాత అది అబద్ధం అని చెప్పినా నా మాట నమ్మట్లేదు ఆయన. నన్నేం చేయమంటారు? ఆయన్ని ఎలా నమ్మించాలి? ఒప్పుకునే తత్వం అలవాటు చేసుకోవాలి అని మీరు ఎప్పుడూ చెప్తుంటారు కదా!

